రంగారెడ్డి । వికారాబాద్ । మేడ్చల్

వార్త





సినీ హీరో యశ్‌తో ఎమ్మెల్యే మల్లారెడ్డి

# ఏడు రకాల వరి సాగు చేస్తేనే బోనస్ ఇస్తాం

### మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారి కె.చంద్రకళ స్పష్టీకరణ



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 23, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం సన్న రకం వరి సాగును ప్రోత్సహించేందుకు వానాకాలం 2026 సీజన్‌కు గాను ఎంపిక చేసిన ఏడు రకాల వరి సాగు చేసే రైతులకు మాత్రమే బోనస్ అందజేయనున్నట్లు మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారిణి కె. చంద్రకళ తెలిపారు. మార్కెట్, వినియోగదారులు మరియు మిల్లర్లలో అత్యధిక డిమాండ్ ఉన్న బిపిటి5204, కెఎన్ఎం1638, కెఎన్ఎం7715, జైశ్రీరామ్, హెచ్ఎంటి, డబ్ల్యుజిఎల్44, మరియు ఆర్ఎన్ఆర్15048 రకాల వరి విత్తనాలకే ఈ బోనస్ వర్తిస్తుందని ఆమె స్పష్టం చేశారు. బోనస్ పొందగోరే రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ వద్ద తప్పనిసరిగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. ఒకవేళ రైతులు సొంత విత్తనాలు ఉపయోగించినా లేదా పరిశోధనా స్థానాల నుండి విత్తనాలు సేకరించినా, సంబంధిత వ్యవసాయ కార్యాలయంలో స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. ప్రభుత్వం సిఫార్సు చేసిన విత్తనాలను మాత్రమే సాగు చేసి, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేసుకొని ఈ బోనస్ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

**మిగతా వారి పరిస్థితి ఏమిటి? బోనస్ నిబంధనలపై అన్నదాతల ఆందోళన**

తెలంగాణ ప్రభుత్వం వానాకాలం2026 సీజన్‌కు సంబంధించి ప్రకటించిన వరి బోనస్ మార్గదర్శకాలపై రైతుల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఏ పంట వేసినా ఆరుగాలం కష్టపడి స్వేదం చిందించేది రైతులేనని, అలాంటప్పుడు కేవలం కొన్ని రకాలకే బోనస్ పరిమితం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే సగానికి పైగా భూముల్లో ఇతర వరి రకాలు సాగు చేసినందున, ప్రభుత్వం విధించిన ఈ నిబంధనల వల్ల వేలాది మంది సన్న, చిన్నకారు రైతులు బోనస్‌కు దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందని వాపోతున్నారు. డీలర్ల వద్ద ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరిగే తిప్పలు తగ్గించి, వరి సాగు చేసిన ప్రతి ఒక్క రైతుకు ఎలాంటి వ్యత్యాసం లేకుండా బోనస్ చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# హద్దు దాటిన అభిమానం

**★టాక్సిక్ ప్రీ రిలీజ్ వేడుకలో అదుపుతప్పిన జనం ★కూలిన భారీ సౌండ్ పోల్.. ★ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు ★హడలెత్తిపోయిన అభిమానులు ★నిర్వాహకులు, యూనివర్సిటీ యాజమాన్యంపై కేసు నమోదు**

**మేడ్చల్, ఆగస్టు 23. ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీ ప్రాంగణంలో శనివారం రాత్రి జరిగిన కన్నడ స్టార్ హీరో యశ్ టాక్సిక్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ తీవ్ర ఉద్రిక్తత, ప్రమాదానికి వేదికైంది. అభిమానులు, విద్యార్థులు వేలాదిగా తరలిరావడంతో వేదిక పరిసర ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. వెనుక ఉన్నవారికి స్టేజ్ కనిపించకపోవడంతో పలువురు అభిమానులు ప్రమాదకర రీతిలో అక్కడే ఉన్న ఫ్లడ్‌లైట్ టవర్లు, సౌండ్ సిస్టమ్ ఇనుప స్తంభాలపైకి ఎక్కారు. సరైన క్రౌడ్ మేనేజ్‌మెంట్ లేకపోవడంతో, తీవ్ర ఒత్తిడికి గురైన ఒక భారీ ఇనుప సౌండ్ పోల్ అదుపుతప్పి కింద ఉన్న జనంపై ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ అకస్మాత్తు ప్రమాదంతో జనం భయంతో పరుగులు తీయగా, ఈ ఘటనలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదం జరిగిన సమయంలో హీరో యశ్ వేదికపై ప్రసంగిస్తున్నారు. ఒక్కసారిగా కేకలు వినపడటంతో ఆయన తన మాట్లాడటం ఆపి, పరిస్థితిని గమనించి అభిమానుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే మైక్ ద్వారా విజ్ఞప్తి చేస్తూ, లైటింగ్ స్టాండ్లు, ఇనుప స్తంభాలపైకి ఎక్కిన అభిమానులంతా కిందకు దిగాలని కోరారు. ఈ ఘటనపై పేట్ బషీరాబాద్ పోలీసులు తీవ్రంగా స్పందించారు. సామర్థ్యానికి మించి జనాలను అనుమతించడం, తగిన బారికేడింగ్, ఎమర్జెన్సీ సేఫ్టీ చర్యలు చేపట్టకపోవడం మరియు భద్రతా ప్రమాణాలను నిర్లక్ష్యం చేసినందుకు గాను మల్లారెడ్డి యూనివర్సిటీ యాజమాన్యంతో పాటు ఈవెంట్ నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సినిమా ప్రమోషన్ల పేరుతో చేసే భారీ ఈవెంట్లలో భద్రత ఎంత కీలకమో ఈ ప్రమాదం మరోసారి హెచ్చరించింది.

అనంతరం హీరో యశ్‌ను వేదికపైకి ఆహ్వానించిన మల్లారెడ్డి ఆయనను ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. యశ్‌తో కలిసి వేదికపై సందడి చేశారు. మల్లారెడ్డి చేసిన ఈ ఎనర్జిటిక్ స్పీచ్, యశ్‌తో ఆయన చేసిన సందడి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



అభిమానులు తాకిడికి అదుపుతప్పి కిందపడుతున్న ఇనుప సౌండ్ పోల్

**తెరమీద కనిపించే తారల్ని నేరుగా తీసుకురావటం ఆనందంగా ఉంది**

ఈ సందర్భంగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే, మల్లారెడ్డి విద్యాసంస్థల అధినేత చామకూర మల్లారెడ్డి తనదైన శైలిలో చేసిన ఎనర్జిటిక్ స్పీచ్ అభిమానులను, విద్యార్థులను ఉత్సాహపరిచింది. వేదికపై మైక్ అందుకున్న మల్లారెడ్డి మాట్లాడుతూ.. టీవీల్లో చూసే అగ్ర హీరోలు, హీరోయిన్లు, దర్శకులను మా విద్యార్థుల ముందుకు తీసుకురావడం చాలా ఆనందంగా ఉందని, ఇలాంటి భారీ కార్యక్రమం మా యూనివర్సిటీ వేదికగా జరగడం గర్వంగా ఉందని అన్నారు.

**మా విద్యార్థులు బంగారాలు**

ప్రముఖ నిర్మాత దిల్ రాజుతో తనకు సుమారు 30 ఏళ్లుగా మంచి స్నేహం ఉందని మల్లారెడ్డి తెలిపారు. దిల్ రాజు అంటే దిల్ బడా.. దిల్ వాలా. ఆయనకు మంచి మనసుంది అంటూ ప్రశంసించారు. ఇంతమంది జనాన్ని చూసి మొదట్లో ఈ కార్యక్రమాన్ని క్యాన్సిల్ చేద్దామా అని కూడా అనుకున్నా. కానీ మా కాలేజీ పిల్లలు చాలా డిసిప్లిన్‌గా ఉన్నారు. వాళ్లు బంగారాలు.. ఆణిముత్యాలు అంటూ విద్యార్థులను అభినందించారు. మల్లారెడ్డి అంటే డిసిప్లిన్.. డిసిప్లిన్ అంటే మల్లారెడ్డి అంటూ తనదైన స్టైల్‌లో చెప్పడంతో సభలో సందడి నెలకొంది. ఈ గ్రౌండ్ తమ విద్యార్థులకు ఎంతో ప్రత్యేకమైనదని, ప్రతి కార్యక్రమానికి దీనిని ఇవ్వబోమని అన్నారు.

**రూ. 2200 కోట్ల కలెక్షన్లు పక్కా...**

టాక్సిక్ సినిమా విజయంపై మల్లారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమా రూ.1000 కోట్లు కలెక్ట్ చేస్తుందని అనుకుంటున్నారు. కానీ నా అంచనా ప్రకారం రూ.2000 కోట్ల నుంచి రూ.2200 కోట్ల వరకు కలెక్షన్లు రావడం ఖాయమని, నిర్మాతలకు ఇక పైసలే పైసలు అంటూ మాస్ డైలాగ్‌తో అభిమానుల్లో జోష్ నింపారు.

# పొలం కాపలాకొచ్చి..

### పాముకాటుతో మహిళా కూలీ మృతి

**పెద్దేముల్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** జీవనోపాధి కోసం వచ్చి పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన మహిళా కూలీ నర్సమ్మ ఉదంతం గ్రామీణ ప్రాంతాల్లో వలస కార్మికులు ఎదుర్కొంటున్న తీవ్రమైన అభద్రతా పరిస్థితులను స్పష్టం చేస్తోంది. పెద్దేముల్ మండలం జనగాం గ్రామ శివారులోని ఫామ్ హౌస్‌లో కాపలాదారులుగా, కూలీలుగా పనిచేసేందుకు నాలుగేళ్ల క్రితం వచ్చిన నర్సమ్మ, ఆంజనేయులు దంపతులు అక్కడి లేబర్ రూమ్‌లోనే నివాసముంటున్నారు. రాత్రి వేళల్లో పొలాల మధ్య ఉండే ఈ తాత్కాలిక నివాసాల్లో సరైన భద్రతా వసతులు లేకపోవడం వల్ల నిద్రిస్తున్న సమయంలో విషసర్పాలు, కీటకాల బారినపడే ప్రమాదం ఎక్కువగా ఉంటోంది. అర్ధరాత్రి సమయంలో నర్సమ్మను పాము కాటు వేయగా, పక్క పొలం నివాసిత బేగరి అనంతప్ప సాయంతో ఆటోలో తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి స్నేక్ బైట్ ఇంజెక్షన్ ఇచ్చినప్పటికీ, ఆమె పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాల్సి వచ్చింది.

**గ్రామీణ ఆస్పత్రులలో అత్యవసర క్రిటికల్ కేర్ ఉదా?**

ఈ ఘటన గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులలో పాముకాటుకు గురైన వారికి అత్యవసర క్రిటికల్ కేర్, వెంటిలేటర్ సౌకర్యాల కొరతను ఎత్తిచూపుతోంది. తాండూరు నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో వికారాబాద్ సమీపంలో తీవ్ర శ్వాసకోశ ఇబ్బంది ఏర్పడటం, వికారాబాద్ ఆసుపత్రికి చేరేసరికే ఆమె మృతి చెందడం ప్రయాణంలో వెంటిలేటర్ అమర్చిన అంబులెన్స్ సదుపాయం ఎంత ముఖ్యమో తెలియజేస్తోంది.

ప్రస్తుతం మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పెద్దేముల్ ఎస్ఐ ప్రశాంత్వర్ధన్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు

# తాండూరులో కీచక లెక్చరర్?

### ఇంటర్ విద్యార్థినికి లైంగిక వేదింపులు

### పోక్సోకేసు నమోదు చేయాలని సిఐటియు డిమాండ్

**పెద్దేముల్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** తాండూరులోని జూనియర్ కళాశాల లెక్చరర్ ఇంటర్ విద్యార్థినిని మాయమాటలతో లోబరుచుకొని వాట్సప్ ద్వారా చాటింగ్ చేస్తు లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై విద్యాసంఘాలు, ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థినిని వేధించిన లెక్చరర్‌పై తక్షణమే పోక్సో చట్టం కింద కేసునమోదు చేసి అరెస్టు చేయాలని సీఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కే.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బాధ్యుడైన అధ్యాపకుడిని కాపాడేందుకు కొందరు రాజకీయ అండదండలతో మధ్యవర్తుల ద్వారా పెద్దమొత్తంలో డబ్బులు చేతులు మార్చి రాజీ ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. విషయం బయటకు రాకుండా నడిపిన ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని భాధ్యులైన లెక్చరర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే విద్యార్థి సంఘాలను కలుపుకొని పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరిం చారు. ఇట్టి విషయంపై తమకు ఏలాంటి



పిర్యాదు రాలేదని, బాధితురాలి నుంచి ఫిర్యాదు అందితే భాధ్యులపై చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ పరమేశ్వర్‌గౌడ్ తెలిపారు.

## ద్యుత్ బకాయిల వసూళ్లకు వెళ్లిన సిబ్బందిపై దాడి

### - కేసు నమోదు చేసిన బోరబండ పోలీసులు

**జూబ్లీహిల్స్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** విద్యుత్ బకాయిల వసూళ్లకు వెళ్లిన అధికారులు, సిబ్బందిపై దాడిచేసిన వ్యక్తిపై బోరబండ పోలీసులు కేసు నమోదు చేశారు. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ ఆపరేటర్ (ఏఈఓ) ఉమ్మర్జీ తబ్రేజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. నేతాజీ నగర్‌కు చెందిన మహ్మద్ హైదర్ విద్యుత్ మీటర్‌ను ట్యాంపరింగ్ చేసినందుకు 2024లో విజిలెన్స్ కేసు నమోదైంది. దీనిపై రూ.11,171 జరిమానా విధించగా, 2025 జులై 19న రూ.1,982 చెల్లించాడు. ఇంకా రూ.9 వేల బకాయి ఉంది. ఈ బకాయిని వసూలు చేసేందుకు తబ్రేజ్ సిబ్బంది షేక్ నూర్ మహ్మద్‌పాషాతో కలిసి హైదర్ ఇంటికి వెళ్లారు. బకాయి చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామని చెప్పడంతో హైదర్ వారిని దుర్భాషలాడుతూ తబ్రేజ్‌ను తోసివేశాడు. దీంతో ఆయన కింద పడిపోయారు. పాషా ప్రశ్నించడంతో అతడి చెంపపై కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.



శాంకరి అఘోరిమాతకు జలధార చేస్తున్న ఆలయ చైర్మన్ మొక్తాల వెంకటయ్య

# అందరి వాడికే అందలం

**◗రంగారెడ్డి డిసిసి సారథి ఎవరు కావాలో మీరే తేల్చండి ◗కార్యకర్తల అభిప్రాయాలకే ప్రాధాన్యం ఇస్తాం ◗సంస్థాగత సంప్రదింపుల కార్యక్రమంలోఎఐసిసి కార్యదర్శి పి.వి. మోహన్**

**శంషాబాద్ ఆగస్టు 23,ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలో భాగంగా, ఏఐసీసీ సూచనల మేరకు సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకుంటున్నామని కర్ణాటక ఎమ్మెల్సీ, ఏఐసీసీ కార్యదర్శి రంగారెడ్డి జిల్లా అబ్జర్వర్ పి.వి. మోహన్ తెలిపారు.రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్ మండలం తండుపల్లి గ్రామంలోని మనస్వి గార్డెన్స్ లో రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సంస్థాగత సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.వి. మోహన్ మాట్లాడుతూ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ఆలోచనలు, మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే సంఘటన్ సృజన్ అభియాన్ ప్రధాన లక్ష్యమన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, అందరినీ కలుపుకుని ముందుకు సాగడమే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలని పేర్కొన్నారు. సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేసి, ప్రజలకు చేరువైన బలమైన సంస్థాగత నిర్మాణాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యమని పి.వి. మోహన్ తెలిపారు. డీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపికలో క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు పూర్తి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. పార్టీని సమర్థవంతంగా ముందుకు నడిపించే, అందరినీ కలుపుకుని పనిచేసే



సమావేశంలో మాట్లాడుతున్న ఎఐసిసి కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అబ్జర్వర్ పి.వి. మోహన్

నాయకత్వాన్ని పారదర్శకమైన విధానంలో ఎంపిక చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ అబ్జర్వర్లు, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సత్తుపల్లి శాసనసభ్యులు డా. మట్టా రాగమయి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. డీసీసీ అధ్యక్ష పదవి కోసం పోటీలో ఉన్న అభ్యర్థులు సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలు, పార్టీ అభివృద్ధికి సంబంధించిన సూచనలు తెలియజేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

## డిగ్రీ విద్యార్థినికి అసభ్య సందేశాలు..

**జూబ్లీహిల్స్, ఆగస్టు 23, ప్రభాతవార్త :** మధురానగర్ ఠాణా పరిధిలో ఒక డిగ్రీ విద్యార్థినికి శ్యాం ప్రసాద్ అనే వ్యక్తి కొద్ది కాలంగా అసభ్యకరమైన సందేశాలను వాట్సాప్ ద్వారా పదేపదే పంపుతున్నాడు. వేధింపులకు గురిచేయ డమే కాకుండా బెదిరింపులకు పాల్పడుతున్నాడు. విద్యార్థిని కుటుంబ సభ్యులను సైతం అసభ్య పదజాలంతో దూషిస్తూ వేధిస్తుండటంతో ఆమె మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**ఉపాధ్యాయురాలికి భర్త బెదిరింపులు**

ఫిల్మ్‌నగర్‌లో నివసించే ఒక ఉపాధ్యాయురాలి భర్త అమీర్ సోహైల్ భార్యను వేధించడంతోపాటు బెదిరింపులకు పాల్పడుతున్నాడు. వ్యక్తిగత ఫొటోలను, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెడుతానంటూ వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ మేరకు ఆమె ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మేడ్చల్ పట్టణంలోని గడిమైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి





హోమంలో పాల్గొన్న తల్లోజు ఆచారి, చైర్‌పర్సన్ పత్యానాయక్ తదితరులు

## మైసమ్మ జాతరలో భక్తుల కోలాహలం

# అమ్మను కన్న అమ్మవో .. ఊరిని కాచే తల్లివో

**ఆమనగల్లు, ఆగస్టు23, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని సురసముద్రం చెరువు కట్టపై కొలువుదీరిన శ్రీకట్ట మైసమ్మ తల్లి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం వైభవోపేతంగా అంత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. వార్షిక వేడుకల సందర్భంగా ఆలయంలో పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సద్గురు శాంకరి అఘోరి మాత హాజరై పూజలు నిర్వహించారు. విశ్వశాంతి కొరకు ప్రత్యేకంగా ఎండుమిర్చి మహా హోమం భక్తులను తన్మయంత్వంలో పరివశింపజేసింది. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్, 14వ వార్డు కౌన్సిలర్ మొక్తల వెంకటయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. సద్గురు శాంకరి అఘోరి మాత ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, బోనాల సమర్పణ, గణపతి పూజ, పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో మొదలైన కార్యక్రమాలు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, కంకణధారణ, గణపతి పూజ వంటి ప్రత్యేక పూజలు జరిగాయి. అలాగే మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ, అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ వార్షిక వేడుకల సంధర్బంగా నిర్వహకులు విద్యుత్ దీపాలు, పుష్పాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తుల రాక ఉదయం నుండే ప్రారంభమై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలు రంగాల ప్రముఖులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల తాకిడికి అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేశారు. ఎండుమిర్చి మహాయజ్ఞం అత్యంత భక్తిశ్రద్దల మధ్య కొనసాగింది. ప్రత్యేక పూజల నేపథ్యంలో సురసముద్రం పరిసరాలు మైసమ్మతల్లి నామస్మరణతో మారుమ్రోగిపోయింది. కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, అధికార పార్టీ రాష్ట్ర నాయకులు ఠాకూర్ బాలాజీ సింగ్, స్థానిక మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహ్మా, ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ పత్యా నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కౌన్సిలర్లు ఎర్రవోలు మహేశ్, పాపిశెట్టి రాము,ఎనుమల్ల రమేష్, హుజూర్నగర్ సిఐ చరమందరాజు, కోఆప్షన్ సభ్యులు చుక్కా అల్లాజీగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, విజయకృష్ణ, సుందూరు ఝాన్సీశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు తదితరులు పాల్గొన్నారు.

**మేడ్చల్‌లో ఘనంగా గడిమైసమ్మ బోనాలు**

**మేడ్చల్, ఆగస్టు 23. ప్రభాతవార్త:** మేడ్చల్ పట్టణంలోని గడిమైసమ్మ అమ్మవారి బోనాలు ఉత్సవాలు కనులపండుగా జరిగాయి. ఉత్సవంలో భాగంగా అమ్మవారికి ఉదయం అభిషేకం, సహస్రనమాలతో కుంకుమార్చన, అమ్మవారి తొట్టెల ఊరేగింపు, మైల బోనాల కార్యక్రమాలను నిర్వహించారు. ప్రజల ఆరాద్యదైవమైన మైసమ్మతల్లిని దర్శించుకనేందుకు భక్తులు ఉదయం నుండే ఆలయానికి క్యూ కట్టారు. అనంతరం అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు భోనాలు ఊరేగింపు నిర్వహించి అమ్మవారిని నైవేద్యం సమర్పించారు. సాయంత్రం యువజన సంఘాల సభ్యులు, భక్తులు, నాయకులు అమ్మవారికి ఫలహార బండ్లు, తొట్టెల ఊరేగింపు పోతరాజుల నృత్యాలు, వివిద వేషదారనుల కళాకారులతో పోటాపోటీగా పట్టణ పురవీదుల గుండా అంగరంగ వైభవంగా నిర్వహించారు.




ధారూర్ పోలీసుల అదుపులో నిందితుడు

## విధుల్లో ఉన్న వారిపై దాడిచేస్తే కఠిన చర్యలు

**ధారూరు, ఆగస్టు 23, ప్రభాతవార్త:** ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై, పోలీసులపై దాడికి పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షి ంచేది లేదని, చట్టాన్ని చేతిలోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు తప్పవని ధారూర్ ఠాణా ఎస్సై సున్నం రాఘవేందర్ హెచ్చరించారు. ధారూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండాపూర్ కాలనీకి చెందిన లాలయ్య, మద్యం మత్తులో అత్యవసర సహాయం కోసం వచ్చే కాల్స్‌పై స్పందించి విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ రాందాస్‌పై ఇటుకతో విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలై పరారీలో ఉన్న నిందితుడు లాలయ్యను శనివారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం అతనికి రిమాండ్ చేసినట్లు ఎస్సై సున్నం రాఘవేందర్ తెలిపారు. ప్రభుత్వ విధుల్లో ఉన్న సిబ్బందిపై దాడులకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యం



**షాద్‌నగర్, ఆగస్టు 23, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో లబ్ధిదారుడు మేడిగా కృష్ణయ్య నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ హాజరై రిబ్బన్ కట్ చేసి లబ్ధిదారుడితో గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష ్యమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలనీల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, 12వ వార్డు కౌన్సిలర్ కల్యాణ్‌కార్ దిలీప్, మురళీమోహన్, రాజు నాయక్, సయ్యద్ ఖదీర్, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, గిరిజన ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం, ముబారక్ అలీ ఖాన్, జంగయ్య, మహబూబ్, ఇసాక్, మహేందర్, సురేష్, నరసింహ, వీరేష్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన

**తలకొండపల్లి, ఆగస్టు 23, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని గట్టు ఇప్పలపల్లి గ్రామంలో నూతనంగా గ్రంథాలయం నిర్మాణానికి ఆదివారం నాడు శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు రేణు రెడ్డి , గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కొబ్బరికాయలు కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రేణు రెడ్డి మాట్లాడుతూ నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో సిఎస్ఆర్ నిధులతో గ్రంథాలయం నిర్మాణానికి సహకారం చేశారని ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరితగతిన గ్రంథాలయ నిర్మాణాన్ని పూర్తిచేసి గ్రామ ప్రజలకు సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు రేన్ రెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్, ఉప సర్పంచ్ విజయ్ నాయకులు సీను రాజశేఖర్, ఆసియా బేగం, అశోక్, ప్రశాంత్ రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



యజ్ఞం చేస్తున్న భక్తులు

## యజ్ఞాలతో శాంతి చేకురుతుంది

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 23, ప్రభాతవార్త:** యజ్ఞాలు చేయడం వల్లన మానవ మనుగడకు శాంతి చేకురుతుందని యజ్ఞ బ్రహ్మలు అరవిందశాస్త్రి, వసుధా శాస్త్రీలు అన్నారు. ఆదివారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని ఆర్య సమాజ్ భవణంలో శ్రావణ వేధ ప్రచార సత్సంగం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగ యజుర్వేద యజ్ఞము, ధ్వజారోహణ కార్యక్రమాలు చేశారు. యజ్ఞ కార్యక్రమంలో ఐదు జంటలు పాల్గొన్నట్లు నిర్వహాలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నాదానం చేసిన ఆకారపు యాదగిరి కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన్ మచ్చ సుధాకర్‌రావు, కొనెరు శ్రీనివాస్, కొనెరు నర్సింగరావు, మిట్ట చిన్నయ్య, శివరాజు, వేణు. యాదయ్య, మురళి, పకిరయ్య, స్వామి, చంద్రమౌళి, చరన్ తదితరులు పాల్గొన్నారు.

## బంగారు ఆభరణాలు మాయం...కేసు నమోదు

**బేగంపేట ఆగస్టు 23,ప్రభాతవార్త :** కారు డిక్కీలో భద్రపర్చిన బంగారు ఆభరణాలు మాయమైన సంఘటన బేగంపేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.అతని కారును సర్వీసింగ్ కు ఇచ్చిన సమయంలో ఆభరణాలు మాయమై ఉండవచ్చని బాధితుడు అనుమానం వ్యక్తం చేసాడు.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.రసూల్‌పురా కు చెందిన సివిల్ ఇంజనీర్ మహేందర్ (55) మే 9న సికింద్రాబాద్ లోని సప్తగిరి టవర్స్ బాంకెట్ హాల్లో జరిగిన ఓ పెళ్లి వేడుకలకు హాజరయ్యాడు.అనంతరం ఆయన భార్య సుమారు 12, 13తులాల బంగారు ఆభరణాలు ఆయనకు అప్పగించింది. అందులో రెండు నెక్లెస్‌లు ఓ లాంగ్ చైన్,మంగళసూత్రం,రెండు గాజులు, రెండు జతల చెవి కమ్మలు ఉన్నాయి.వాటిని మారుతి సియాజ్ కారులోని డిక్కీలో పెట్టిన మహేందర్ ఆ విషయాన్ని మర్చిపోయాడు.మే 16న ఇంటి వెనుక ఉన్న గ్యారేజీలో కారును సర్వీసింగ్‌కు ఇచ్చాడు.సుమారు నాలుగు రోజుల పాటు కారు గ్యారేజీలోనే ఉంది.అనంతరం కారును తిరిగి తీసుకున్న ప్పటికీ డిక్కీలోని బంగారం గుర్తుకు రాకపోవడంతో ఆభరణాలు కనిపించక పోవడాన్ని అతను గమనించలేదు.జులై 2న రాత్రి భార్య అభరణాల గురించి అడగడంతో మహేందర్‌కు ఆ విషయం అప్పుడు గుర్తుకు వచ్చింది.కారుతో పాటు ఇంట్లో మొత్తం వెతికినా అవి కనిపించలేదు.కారు గ్యారేజీలో ఉన్న సమయంలో బంగారు ఆభరణాలు మాయమై ఉండవచ్చని బాధితుడు అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసాడు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నగరంలో కమ్మేసిన ముసురు

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త :** నగరంలో వాన ముసురు కమ్మే సింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసింది. రాజేంద్రనగర్, శంషాబాద్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, కిస్మత్పూర్, బండ్ల గూడ, హైదర్‌షాకోర్టు, నార్సింగ్, మణికొండ, పుప్పాలగూడ, కోకాపేట్, గండిపేట తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. అంబర్‌పేట, విద్యానగర్, రామంతాపూర, కోరంటి, నారాయణగూడ ప్రాంతాల్లోనూ వర్షం కురిసింది. సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, డైమండ్ పాయింట్, క్లాక్‌టవర్, మోండా మార్కెట్, బేగంపేట్, రాంగోపాల్‌పేటతో పాటు పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది.ఆదివారం కావడంతో సాయంత్రం వేళ బయటకు వచ్చిన వాహనదారులు వర్షంతో ఇబ్బంది పడ్డారు.వాతావరణ శాఖ భారీ వర్ష సూచన చేసింది. ఆదివారం నుంచి మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

# గురుకుల్ సమస్యలపై సిఎంను కలుద్దాం

**ఘట్‌కేసర్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ గురుకుల్ విద్యాసంస్థలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి వెల్లడించారు. మేడ్చల్ జిల్లా ఎంఎంసీ ఘట్‌కేసర్ సర్కిల్ ఘట్‌కేసర్ డివిజన్ గురుకుల్ జూనియర్ కళాశాలలో శనివారం ఆయన మరుగుదొడ్లు, అధ్యాపకుల గదిని ప్రారంభించారు. జిపిఎస్ నాయకులతో కలిసి ఆయన రిబ్బిన్ కత్తిరించి అందుబాటులోకి తెచ్చారు. విద్యార్థులకు మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతుండగా గురుకుల్ పరిరక్షణ సమితి, జేఏసీ నాయకులు దాతల సహకారంతో విరాళాలు సేకరించి వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మాణం చేయించారు. డానో కంపెనీ యాజమాన్యం సిఎస్ఆర్ నిధులతో ఒక తరగతి గదిని నిర్మించగా అధ్యాపకుల స్టాఫ్ రూమ్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈసందర్భంగా బండారి శ్రీనివా స్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లా డుతూ గురుకుల్‌లో పేదవిద్యార్థులు చదువుతున్నారని వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. గురుకుల్‌కు అవసరమైన ప్రతిపాదనలను ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి సిద్ధం చేస్తే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. దేశభవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని, సమయం వృదా చేయకుండా క్రమశిక్షణతో చదివితే మంచి అవకాశాలు వచ్చి గొప్పవాళ్లు అవుతారని తల్లిదండ్రులకు మంచి పేరు వస్తుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా నిర్మాణాలకు సహకరించిన దాతలను శాలువాలు కప్పి సన్మానించారు. గురుకుల్ అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా నాయకులు, పూర్వవిద్యార్థులు సమిష్టిగా కృషి చేయాలని పలువురు కోరారు. ఇంటర్మీడియట్‌లో ఫస్ట్‌క్లాస్ మార్కులు వచ్చిన విద్యార్థులకు రూ.5 వేలు ప్రోత్సాహక బహుమతి అందజేస్తామని లాల్‌బహదూర్ స్మారక యూత్ ప్రకటించింది. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపిపిలు బండారి శ్రీనివాస్‌గౌడ్,



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఏనుగు సుదర్శన్‌రెడ్డి, టీజేఎస్ జిల్లా అధ్యక్షులు-జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్లు సార శ్రీనివాస్‌గౌడ్, డొంకెన బిక్షతిగౌడ్, డైరక్టర్లు రేసు లక్ష్మారెడ్డి, చందుపట్ల ధర్మారెడ్డి, రిటైర్డ్ టీచర్ వి.వెంకట్‌రాంరెడ్డి, ఎల్‌బి యూత్ అధ్యక్షులు చేపూరి బ్రహ్మం, బండారి పట్టాబి, మాజీ సర్పంచ్ వేముల సంజీవగౌడ్, మాజీ ఎంపిటిసిలు మేకల నర్సింగ్‌రావు, ధీకొండ రఘు, గౌడ సంఘం అధ్యక్షులు మదనగిరి సురేశ్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు కొమ్మిడి అనురాధ, బండారి అంజనేయులు, షేక్‌జహంగీర్, బేతాల నర్సింగ్‌రావు, మాజీ వార్డుసభ్యులు గడీల సంజీవరెడ్డి, బిజెపి జిల్లా మీడియా కన్వీనర్ చలువాది ప్రవీణ్‌రావు, డివిజన్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, గురుకుల్ పరిరక్షణ సమితి కన్వీనర్ అంకం సురేశ్‌కుమార్‌యాదవ్, కట్టా జనార్దన్‌రెడ్డి, కందకట్ల పద్మారెడ్డి, కొమ్మిడి రాఘవరెడ్డి, బచ్చు నగేశ్‌కుమార్, కడప ఈశ్వర్, కందకట్ల సుదర్శన్‌రెడ్డి, కందకట్ల మాధవరెడ్డి, పన్నాల కొండల్‌రెడ్డి, బద్దం జగన్మోహన్‌రెడ్డి, అబ్బగౌని నాగరాజు, బోగ అర్జున్, చుక్కల రవిశంకర్, బిజిలి సదానందం, ఎంఎ.ఖలీల్‌అక్రమ్, ఎండి.సిరాజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా మహా కుంభాభిషేక పూజలు

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ వార్డు 8 వెంకటాపూర్‌లో శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మహా కుంభాభిషేక మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్ హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ శివనాగేంద్ర సరస్వతి స్వామి పాల్గొని భక్తులకు స్వామివారి ప్రవచనాలు వినిపించారు. శ్రీ స్వయం భూ బాలాజీ వేంకటేశ్వర స్వామిని ముఖ్య అతిథి వజ్రేశ్ యాదవ్ దర్శించుకుని పూజలు చేశారు. టీజీఎల్‌డీఏ కార్పొరేషన్ చైర్మన్ చరణ్ కౌశిక్ యాదవ్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేశ్ తదితరులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు డీసీసీ అధ్యక్షుడికి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇటికాల కృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కర్రె జంగమ్మ, ఆయా డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షులు బోక్కా ప్రభాకర్‌రెడ్డి, సామల అమరేందర్, బండి శ్రీరాములు,



వేడుకల్లో పాల్గొన్న డిసిసి అధ్యక్షుడు వజ్రేశ్ యాదవ్

తుంగతుర్తి రవి, పోచారం డివిజన్ మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. వినోద్ కుమార్, యుగేందర్, కాంగ్రెస్ నాయకులు పసులాది నర్సింగ్‌రావు ముదిరాజ్, భోజిరెడ్డి, ఎం. సుధాకర్, నరేశ్, నాగరాజు సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

# మంబాపూర్‌ను ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేస్తున్నాం

**పెద్దేముల్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సహకారంతోనే మంబాపూర్ గ్రామ రూపురేఖలు మారాయని కాంగ్రెస్‌పార్టీ గ్రామ కమిటి అధ్యక్షులు హన్మగల్ల యాదయ్య, ఉపాధ్యక్షులు గొబ్బురు రాములు అన్నారు. ఆదివారం పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ హయంలో దశల వారిగి అభివృద్ధి జరుగుతుంటే బిఆర్ఎస్ నాయకులు ఓర్వలేకనే తమ పార్టీపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే చొరవతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా మంబాపూర్‌లో రోడ్లు, డ్రైనేజి, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర కనీస మౌలిక వసతల సమస్యలు పరిష్కరించడానికి సుమారు కోటి పదిహేను లక్షలు వెచ్చించడం జరిగిందని అన్నారు. పంచాయతీ భవనానికి రూ. 20 లక్షలు, డ్రాక్వ భవనం కోసం రూ. 10 లక్షలు, పాఠశాలలో సైన్స్ గది కోసం రూ. 21 లక్షలు, కంపౌండ్ వాల్ కోసం రూ. 3 లక్షలు మంజూరు చేయడానికి ఎమ్మెల్యే చిత్తశుద్దే కారణమని అన్నారు. నియోజకవర్గంలోనే మంబాపూర్‌కు మొట్ట మొదటగా ప్రాధాన్యాత ఇచ్చి ఆదర్శ గ్రామంగా మొదటి విడతలోనే 328 ఇందిరమ్మ ఇండ్లు, 150 రేషన్ కార్డులు, ఆత్మీయభరోసా కింద 84 మంది లబ్ధిదారులకు రూ. 6 వేలు చొప్పున అందించి ఎమ్మెల్యే అభివృద్ధి ప్రదాతగా నిలిచారని అన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కొంత మంది కళ్ళు ఉండి చూడలేని అందులుగా



మాట్లాడుతున్న గ్రామ కమిటి అధ్యక్షులు యాదయ్య

ప్రభుత్వంపై, ఎమ్మెల్యేపై మాట్లాడడం హస్యస్పదమని అన్నారు. నిజానికి మంబాపూర్ గ్రామ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తు, బిఆర్ఎస్ నాయకులు వారి ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో మాజి ఎమ్మెల్యే మెప్పు కోసం ఆడిన నాటకంగా చెప్పవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బోయిని నారాయణ, ఆర్.శ్రావన్, నాయకులు ఖలీల్, శ్రీనివాస్, ఇబ్రాహీం, మంగలి పాండు, అంజి, యేసు, విజయ్‌కుమార్, చెన్నారం శ్యామ్, కుమ్మరి నర్సిములు, తెరువటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరిపై కేసు

**బేగంపేట ఆగస్టు 23,ప్రభాతవార్త :** రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొను గోలు చేసి ఇతర ప్రాంతాల్లో అధిక ధరకు విక్రయిస్తున్న ఇద్దరిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసారు.వారి నుంచి సుమారు 40క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంతో పాటు బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.రసూల్‌పురా చౌరస్తా వద్ద శనివారం మధ్యాహ్నం గం 3.45నిల సమయంలో ఎస్సై శ్రావణ్ కుమార్ తన సిబ్బంది తో కల్సి వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు.సాయంత్రం గం 4ల సమయంలో టీజీ 30టీ6198 నెంబర్ గల బొలెరో వాహనం సికింద్రాబాద్ వైపు వస్తూ వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులను చూసి వాహనాన్ని ఒక్క సారిగా బ్రేక్ వేసి వాహనాన్ని వెనక్కు మళ్లించేందుకు ప్రయత్నించాడు. అనుమానం వచ్చిన పోలీసులు వాహనాన్ని పక్కకు ఆపి తనిఖీ చేయగా అందులో పీడీఎస్ బియ్యం బస్తాలు బయట పడ్డాయి.డ్రైవర్ లావుడియా నితిన్ (23)ను విచారించగా వాహన యజమాని ధరావత్ రాముతో కల్సి కొంత కాలంగా రేషన్ కార్డులదారుల నుంచి కిలో రూ 10ల చొప్పున పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించాడు.అనంతరం తండాలు,పరిసర ప్రాంతాల్లో అవసరం అయిన వారికి కిలో రూ 15నుంచి రూ 18కి విక్రయిస్తు న్నామని,లాభాలు ఆర్జిస్తున్నట్లు వెల్లడించాడు.ఈ క్రమంలో పార్శిగుట్ట నుంచి పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలుచేసి బొలెరో వాహనంలో 80బస్తాల్లో 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం,బొలెరో వాహనం,వన్‌ప్లస్ మొబైల్ ను పోలీసులు సీజ్ చేసారు.నిందితుడిని అదుపులోకి తీసుకోగా వాహన యజమాని ధరావత్ రాము పరారీలో ఉన్నాడు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా బోనాల వేడుకలు

**కంటోన్మెంట్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** శ్రావనమాస బోనాల వేడుక లను పురస్కరించుకొని ఆదివారం 2,3 వార్డులలోని ఎల్లమ్మ,మల్లికార్జున స్వామి,బీరప్ప స్వామి,పోచమ్మ,పెద్దమ్మ దేవాలయాల్లో బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ, బిఆర్ఎస్ నేతలు బి.ఎన్.శ్రీనివాస్, బానుక మల్లికార్జున్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గౌలిగూడ సెంట్రల్ గురుద్వారా నిర్వహించిన 2కె, 5కె రన్ దృశ్యం

# వైద్యవృత్తికే స్ఫూర్తి డా. సూరి

### రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. రమణాచారి

**రవీంద్రభారతి, ఆగస్టు 23 ప్రభాతవార్త :** ఆసుపత్రుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడడంలో ఉన్న నిబద్ధత రోగులపట్ల చూపించని నేటి కార్పొరేట్ వైద్యవ్యవస్థలో రెండు లక్షలకుపైగా ప్రసవాలు దిగ్విజయంగా నిర్వహించి రోగి క్షేమమే పరమావధిగా అకుంటిత సేవాభావంతో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ సూరి వైద్యవృత్తికే స్ఫూర్తి వైద్యులందరికి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. డా. సూరి 90 ఏళ్ల వయస్సు పైబడిన ఆవిడ చేతులమీదుగా జన్మనందుకున్నవారు మూడుతరాలవారు ఆవిడ గొప్పతనాన్ని తలచుకుంటూనే ఉంటారన్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో లేఖిని రచయిత్రుల వేదిక, సరసిజ థియేటర్ ఫర్ విమెన్ సంయుక్త నిర్వహణలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ పాత్రికేయుడు వల్లీశ్వర్ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు డా. అత్తలూరి విజయలక్ష్మి, డా. పద్మావతి, శిరోమణి డా. వంశీరామరాజు, సరస్వతి తదితరులతో కలిసి ప్రఖ్యాత వైద్యురాలు డాక్టర్ సూరిని ఘనంగా సత్కరించి ప్రసూతి ప్రాణదాయిని బిరుదు, గుండె లక్ష్మీనరసమ్మ స్మారక పురస్కారం ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు. వల్లీశ్వర్



డా. సూరి శ్రీమతిని బిరుదు పురస్కారాలతో సత్కరిస్తున్న రమణాచారి, వల్లీశ్వర్, రామరాజు

అధ్యక్షోపన్యాసంలో డా. సూరి 90ఏళ్ల వయస్సుల్లోనూ ఏమాత్రం తొణకకుండా ఆపరేషన్లు నిర్వహించడం గొప్పవిషయమని, నగరంలోని ప్రముఖ సాగర్‌లాల్ ఆస్పత్రిలో ఒకవార్డుకు ఆవిడ పేరు పెట్టడం వృత్తిపట్ల ఆమెకున్న నిబద్ధతను చాటుందని కొనియాడారు. సభకు స్వాగతం పలుకుతూ నాగలక్ష్మి వారణాసి కార్యక్రమ నేపథ్యాన్ని వివరించగా సభకుముందు కె.రామాచారి శిష్యబృందంచే ప్రార్థనాగీతం, లలితసంగీతం, చేజెర్ల వినయ ఆలపించిన రవీంద్రుని గీతాలు ఆకట్టుకున్నాయి.

# నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు

### డిఇ వినోద్ కుమార్

**చిక్కడపల్లి, ఆగస్టు 23, ప్రభాతవార్త:**

వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు టీజీఎస్‌పీడీసీఎల్ అజామాబాద్ సెక్షన్ డివిజనల్ ఇంజినీర్(డీఈ) ఆర్.వినోద్‌కుమార్ ఆదివారం తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అజామాబాద్ సెక్షన్ కార్యాలయంలో మాట్లాడారు. విద్యుత్ సరఫరాకు సంబంధించి సమస్యలు ఎదురైనప్పుడు వినియోగదారులు ఆందోళన చెందకుండా సమీపంలోని విద్యుత్ సరఫరా కార్యాలయం(సెక్షన్ ఆఫీస్)ను సంప్రదించాలని సూచించారు. అక్కడ అధికారులకు సమస్యను నేరుగా తెలియజేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదులను సకాలంలో స్వీకరించి, సమస్య స్వభావాన్ని గుర్తించి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారని వివరించారు. డివిజన్ పరిధిలో అజామాబాద్, ముషీరా



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

బాద్, నారాయణగూడ, రాంనగర్, శంకరమఠం, కాచిగూడ, అంబర్‌పేట్, గోల్నాక, రామాలయం తదితర సెక్షన్ల పరిధిలో 1.70 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, ఈ నేపథ్యంలో వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంపై దృష్టిసారిస్తున్నట్లు డీఈ తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో సాంకేతిక సిబ్బంది స్పందించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తూ సమస్యలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.వినియోగదారులు విద్యుత్ పరికరాలు, కనెక్షన్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని, విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు అనధికార వ్యక్తులను సంప్రదించకుండా సంబంధిత విద్యుత్ శాఖ కార్యాలయాలను ఆశ్రయించాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, తీగలు లేదా ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన సమస్యలు కనిపించినా వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. విద్యుత్ సంస్థ సేవలను మరింత మెరుగుపరిచేందుకు వినియోగదారుల సహకారం అవసరమని వినోద్‌కుమార్ అన్నారు. ప్రతి నెలా విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలని, బకాయిలు లేకుండా చూసుకోవాలని సూచించారు. వినియోగదారుల సమస్యలను వేగంగా పరిష్కరించడంతో పాటు మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని డీఈ స్పష్టం చేశారు.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

**ఘట్‌కేసర్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్-బీబీనగర్ రైల్వేస్టేషన్ల మధ్య ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఏదో రైలు కింద పడి ఓవ్యక్తి మృతిచెందాడని సికింద్రాబాద్ రైల్వేపోలీసులకు సమాచారం అందింది. జిఆర్‌పి ఎస్‌హెచ్‌ఓ ఆదేశాల మేరకు రైల్వే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడు గుర్తుతెలియని వ్యక్తి కాగా 50 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు కల్గి ఉంటాడని, తెల్ల బనియన్, సగం నీలపు రంగు లుంగీ నల్లగీతలు, కాఫీ రంగు ఫుల్‌డ్రాయర్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతునికి కడుపుపై పుట్టుమచ్చ ఉందని ఆచూకి తెలిసిన వారు జిఆర్‌పి పోలీస్ 9440083160, 8712658581లకు సంప్రదించాలని పోలీసులు తెలియజేశారు.

## ఎన్ఆర్ఆర్ పురం కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఇళ్ల థర్డ్ పార్టీ రిజేస్ట్రేషన్‌కు కృషి

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 23, ప్రభాతవార్త:** ఎన్ఆర్ఆర్ పురం కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ థర్డ్ పార్టీ రిజిస్ట్రేషన్‌కు కృషి చేయడం జరుగుతుందని సొసైటీ అధ్యక్షుడు షేక్‌యూసుఫ్ ఉద్దీన్ అన్నారు. ఆదివారం బోరబండ ప్రొఫెసర్ జయశంకర్ కమ్యూనిటీ హాల్లో సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సొసైటీ అధ్యక్షులు షేక్ యూసుఫ్ ఉద్దీన్ మాట్లాడుతూ 2400 మంది సభ్యులు ఉన్న ఈ సొసైటీలో కొద్దిమందికి ఇళ్లు కేటాయించలేదని ఈ సమస్య పరిష్కారానికి ఒక ఎకరా 4 గుంటల స్థలం కోసం తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. సొసైటీ సభ్యుల సమస్యలు తీర్చడంతో పాటు వాళ్లకు అన్ని వేళల పాలక మండలి అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి మహ్మద్ ఇమామ్ ఘోరీ, ఉపాధ్యక్షులు అయలయ్య, కోశాధికారి సత్యనారాయణ, మేనేజింగ్ కమిటీ సూపవైజింగ్ ప్రతినిధులు, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## టెక్నాలజీ మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలను సాధించాలి

### ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కుమార్ మోలుగారం

**సరూర్‌నగర్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేయడం అంటే ఒక మైలు రాయిని దాటడమేననీ అయితే వాస్తవిక విజయానికి నిరంతర అభ్యాసం, నూతన నైపుణ్యాల సాధన ఎంతో అవ సరమని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మోలుగారం అన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలైన హైదరాబాద్ నాదర్‌గుల్ ఎంవిఎస్ఆర్, సైదాబాద్ మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలకు సంబంధించిన గ్రాడ్యుయేషన్ డే-2025 వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. మాతృశ్రీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నాదర్ గుల్‌లోని కాలేజీ క్యాంపస్ ఆడిటోరియంలో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సొసైటీ ఛైర్మన్ పివి కశ్యప్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు ఈ సందర్భంగా వైస్ ఛాన్స లర్ మాట్లాడుతూ ప్రపంచంలో రోజు రోజుకీ సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తీర్చిదిద్దుకోవాలని సూచించారు. మాతృశ్రీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ పివి కశ్యప్ ప్రసంగిస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవ డంతోపాటు నిత్య జీవితంలో విలువలు, నైతికత, సామాజిక బాధ్యతలను పాటించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వైస్‌ఛాన్సలర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను, ప్రతిభావంతులకు బంగారు పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ జాయింట్ సెక్రటరీ కె. వెంకటేశ్వర గుప్త, సభ్యులు ఎంవిఎస్ పవన్‌కుమార్, సుధాకర్ జూపూడి, కెవిఆర్‌కె సుబ్రమణ్యం, ఎంవిఎస్ఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కామేశ్వర రావు, మాతృశ్రీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జి.అమరేందర్ రావు, ఎంఇఎస్ డైరెక్టర్, ఎగ్జామినేషన్స్ అండ్ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ సిపి వర్ధిని, డైరెక్టర్ ప్లేస్‌మెంట్స్ అండ్ ప్రాజెక్ట్ ప్రొఫెసర్ జె.ప్రసన్న కుమార్, పలువురు హెచ్‌ఓడిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నేటి నుంచి చిక్కడపల్లి శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు

**చిక్కడపల్లి ఆగస్టు 23, ప్రభాతవార్త:**

చిక్కడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు శ్రీస్వామివారి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్, అసిస్టెంట్ కమిషనర్, ఈఓ వి.సుశీల్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, కలశపూజలు తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నెల 24న సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పవిత్రోత్సవాలకు అంకురార్పణ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, మృత్సం గ్రహణం తదితర కార్యక్రమాలు జరుగుతాయి. 25న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 26న బుధవారం ఉదయం 6.30 గంటల నుంచి పవిత్రోత్సవాల ముగింపు కార్యక్రమాలు జరుగుతాయి. 41 కలశములతో అభిషేకం, తిరుమంజనం, మంత్రపుష్పం, చందన గోష్ఠి, ఆశీర్వచనం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

## యువత ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయాలి

**షాద్‌నగర్, ఆగస్టు 23, ప్రభాతవార్త :** చటాన్‌పల్లి రాంనగర్, సిమ్లా నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన పోచమ్మ అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 3వ వార్డు కౌన్సిలర్ నందారం అశోక్ యాదవ్ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అశోక్ యాదవ్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మికత మనిషిలో మంచి ఆలోచనలు, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందిస్తుందని అన్నారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక ధోరణితో ముందుకు సాగాలని సూచించారు. పెద్దలను గౌర విస్తూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో యువత భాగస్వా ములు కావాలని కోరారు. ఆలయాలు కేవలం పూజలు నిర్వహించే ప్రదేశాలు మాత్రమే కాకుండా ప్రజల మధ్య ఐక్యత, భక్తి, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే కేంద్రాలుగా నిలుస్తాయని అశోక్ యాదవ్ పేర్కొన్నారు. పోచమ్మ అమ్మవారి ఆశీస్సులతో కాలనీవాసులందరూ సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. విగ్రహ ప్రతిష్ఠ సంద ర్భంగా ప్రత్యేక పూజలు, మంగళహారతి నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పోచమ్మ గుడి చైర్మన్ కడీగా శివకుమార్, వైస్ చైర్మన్ వాటర్ రాజు, వినోద్, పేపర్ శివ, ప్రశాంత్, ఉదమ్, రాకేష్, చిన్న, సాయి, కృష్ణతో పాటు భక్తులు, ప్రజలు, కాలనీవాసులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న జంగయ్య,రవి

## పోచమ్మ గుడికి విరాళం

**షాద్‌నగర్, ఆగస్టు 23, ప్రభాతవార్త :** ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామంలో జరుగుతున్న పోచమ్మ దేవాలయ నిర్మాణ పనులకు వెల్ జర్ల గ్రామానికి చెందిన జాం గారి కుటుంబ సభ్యులు 52 వేలు విరాళం అందించారు ఈ విరాళాన్ని పోచమ్మ గుడి కమిటీ చైర్మన్ కావాలి నర్సింహులు మరియు కమిటీ సభ్యులకు అందజేశారు ఈసందర్భంగా జాం గారి కుటుంబ సభ్యులు జాంగారి జంగయ్య, జాంగారి రవి మాట్లాడుతూ తమ సొంత గ్రామంలో నిర్మిస్తున్న పోచమ్మ గుడికి తన వంతుగా సహాయం చేసినట్లు తెలిపారు గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అండగా నిలుస్తూ ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు జాంగారి కుటుంబ సభ్యుల కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పోచమ్మ గుడి పునర్ నిర్మాణ కమిటీ చైర్మెన్ కావాలి నర్సింహులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, ధార్మిక కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ముందుండే వారి సేవలను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో జాంగారి రామయ్య, జాంగారి యాదయ్య,జాంగారి మల్లయ్య, జాంగారి నర్సింహులు, జాంగారి నర్సింహులు బ్యాంక్ మేనేజర్,జాంగారి యాదయ్య, జాంగారి జంగయ్య, జాంగారి రవి, జాం గారి శరత్ కుమార్, జాంగారి రాములు,జాంగారి శ్రీకాంత్, జాంగారి యాదయ్య, జాంగారి వరప్రసాద్, జాం గారి విష్ణు,జాంగారి రామచంద్రయ్య, జాంగారి గోపాల్, జాంగారి నాగరాజు, జాంగారి గణేష్, జాంగారి నరేష్, జాంగారి బాలరాజు, జాంగారి నర్సింహ, జాంగారి భాస్కర్, జాం గారి విజయ్, జాంగారి మనోహర్, జాం గారి రాఘవేందర్,జాంగారి నాని, జాంగారి చందు, జాంగారి అరవింద్ , జాం గారి బన్నీ,గ్రామ నేతలు గణేష్ గౌడ్, కావాలి బాల నర్సింహులు, దొడ్డి రవీందర్,దొడ్డి రాందాస్, కావాలి కెవి ఎం,తుప్పరీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**అమనగల్, ఆగస్టు 23:** తిరుపతయ్యగౌడ్ కుటుంబాన్ని ఆదివారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. తిరుపతయ్య తండ్రి వల్లభుదాస్ పెంటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ వ్యవస్థా పక చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేం దర్‌రెడ్డి, కల్వకుర్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తోపాటు పలువురు రాజకీ య నాయకులు అకుతోట పల్లిలో బాధిత నివాసానికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, శివ, చంద్రశేఖర్, అర్జున్ రావు, లక్ష్మీ నరసింహారెడ్డి, గౌని లాలయ్య గౌడ్, చిటుగోరి భాస్కరరావు, రంగయ్య, బర్ల వెంకటయ్య, సర్పంచ్ శ్రీను నాయక్, శ్రీను, బాలయ్య గౌడ్, నిరంజన్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, యాదగిరి తదితరులు ఉన్నారు.

## ఉచితంగా వీధి దీపాలు పంపిణీ

**శామీర్‌పేట, ఆగస్టు 23, ప్రభాతవార్త :** కేశ్వాపూర్ గ్రామానికి చెందిన దాత ఐలాపురం కిరణ్‌కుమార్‌రెడ్డి గ్రామంలో వీధి దీపాల సమస్య తీర్చటానికి 30 వీధి దీపాలు (స్ట్రీట్‌లైట్స్) ఉచితంగా అందజేసినట్లు కేశ్వాపూర్ (10వ వార్డు) కౌన్సిలర్ మెరుపాటి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని కేశ్వాపూర్ గ్రామంలో వీధి దీపాల సమస్యను తీర్చటా నికి దాత కిరణ్‌కుమార్‌రెడ్డి 30వీధి దీపాలు అందజేసినట్లు తెలిపారు. కేశ్వాపూర్ గ్రామంలో వీధి దీపాల సమస్య ఉందని ఆయన దృష్టికి తీసుకవెళ్లగా కిరణ్‌కుమారెడ్డి స్పందించి గ్రామానికి 30వీధి దీపాలు (స్ట్రీట్‌లైట్స్) అందజేసినట్లు ఆయన తెలిపారు. కేశ్వాపూర్ గ్రామం తరపున కిరణ్‌కుమార్‌రెడ్డికి కౌన్సిలర్ గోవర్ధన్‌రెడ్డి దన్యవాదాలు తెలియజేశారు. దాత కిరణ్‌కుమార్‌రెడ్డిని కౌన్సిలర్ గోవర్ధన్‌రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు నాయకులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## మైసమ్మ ఆలయానికి విరాళం

**ధారూర్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** ధారూర్‌లోని 5వ వార్డు, శాలివాహన కాలనీలో శ్రీ మైసమ్మ తల్లి దేవాలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేవాలయ నిర్మాణానికి తమ వంతు సహాయంగా 5వ వార్డు సభ్యులు ఎండి జాకీర్ 11,000 వేల రూపాయల విరాళాన్ని ఆదివారం అంద జేశారు. దేవాలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తూ, ఆధ్యా త్మిక కార్యక్రమాలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న జాకీర్ సేవాభావాన్ని శాలివాహన మైసమ్మ దేవాలయ కమిటీ ప్రత్యేకంగా అభినందించింది.

# స్థానిక సమస్యలపై సమన్వయంతో..

**షాద్‌నగర్, ఆగస్టు 23, ప్రభాతవార్త :** ప్రజల అవసరాలను గుర్తించి, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని హిందూ శ్మశాన వాటికలో నెలకొన్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. శ్మశాన వాటికలో నీటి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించిన స్థానిక నాయకులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అందె మోహన్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ బసవప్ప, వార్డు కౌన్సిలర్ బచ్చలి నరేష్ ల సమన్వయంతో ఆదివారం హిందూ శ్మశాన వాటికలో బోర్ ఏర్పాటు కార్యక్రమాన్ని చేపట్టి విజయవంతంగా పూర్తి చేశారు. దీంతో ఇకపై అంత్యక్రియలకు వచ్చే ప్రజలకు అవసరమైన నీటి సౌకర్యం అందుబాటులోకి రానుంది. శ్మశాన వాటిక వంటి ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు ఎంతో అవసరమని, నీటి సమస్య పరిష్కారంతో ప్రజలకు కొంత ఊరట లభించిందని స్థానికులు పేర్కొన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి, వాటికి తక్షణ పరిష్కార మార్గాలు చూపుతున్న అందె మోహన్‌తో పాటు మున్సిపల్ చైర్మన్ బసవప్ప, వార్డు కౌన్సిలర్ బచ్చలి నరేష్‌లకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ ఖానుగు అనంతయ్య, కొండ యాదయ్య, కొండ సత్తయ్య, చౌలా రవి, భూషం నరేష్, మంగా శేఖర్, భూషం చిన్న, హబీస్, నౌశద్, అబూ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు."ప్రజా సమస్యే లక్ష ్యం.. పరిష్కారమే ధ్యేయం" అనే సామాజిక దృక్పథంతో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ముందుకు సాగడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. బోర్ ఏర్పాటు పూర్తికావడంతో శ్మశాన వాటికకు నీటి సౌకర్యం అందుబాటులోకి రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



బోరు మోటార్ డ్రిల్లింగ్ ప్రారంభిస్తున్న దృశ్యం

# గతంలో ఎప్పుడూ లేని విధంగా పేదలకు ఇళ్లు ఇస్తున్నాం

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 23,ప్రభాతవార్త:** ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని గాలిగూడ, గుంజల్‌పహాడ్ గ్రామా లలో నూతన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి ఇంటి యజమానులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేద ప్రజలకు నూతన ఇళ్లను మంజూరు చేసినట్లు పెర్కొన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల వల్లన లబ్ధిదారులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గతంలో ఎప్పుడు లేని విధంగ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్టు ఆయన పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బందయ్య, స్వప్న సత్యం, మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చలివేంద్రంపల్లి రాజు, మహిళా అధ్యక్షురాలు రజిత వెంకటయ్య, రాములు, శివమౌళి, యాదయ్య, ఉప సర్పంచ్ బలరామ్, మాజీ సర్పంచులు బాలరాజ్, పాలమురు యాదయ్య, మాజి ఎంపిటిసిల సంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట నర్సింహా రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు రవి కుమార్ ,బీసీ సెల్ అధ్యక్షులు వెంకట్రాములు, గోబ్రియానాయక్, దామోదర్,మల్లేష్ పాపయ్య,రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న నాయకులు



సర్పంచ్ సంధ్యా సుభాష్ గౌడ్‌ను అభినందిస్తున్న దృశ్యం

## సమాజ సేవకు నడుంబిగించండి

**మోమిన్ పేట్, ఆగస్టు 23. ప్రభాతవార్త:** మోమిన్ పెట్ మండల కేంద్రంలో పాత బస్టాండ్ లో గడ్డం శైలజ జ్ఞాపకార్థం బస్ షెల్టర్‌ను ముఖ్య అతిథిగా హాజరై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రయాణికుల సౌకర్యార్థం గడ్డం శైలజ జ్ఞాపకార్థం 2.50 లక్షల రూపాయలతో బస్ షెల్టర్ సొంత డబ్బుతో నిర్మాణం చేసిన మోమిన్ పేట్ గ్రామ సర్పంచ్ సంధ్య సుభాష్ గౌడ్‌ను శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అభినందించారు. ఆదివారం మోమిన్ పెట్ మండల కేంద్రంలోని పాత బస్టాండ్ లో ప్రయాణికులు నిల్చుండడానికి నీడ లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా ఈ బస్సు షెల్టర్ అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. సేవా కార్యక్రమాలు చేయడం సంతోషకరమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడానికి ప్రతి ఒక్కరు ముందుకు వస్తే గ్రామంలో ఇబ్బందులు లేకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మన్నె శంకర్ యాదవ్, వికారాబాద్ డిపో మేనేజర్ నమ్రుత, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, నాయకులు మహంత్ స్వామి, ఏరాజ్ పాషా, మైపాల్, వేమారెడ్డి, అప్సర్, సోమారపు రవి, ఆయా గ్రామాల సర్పంచులు నాయకులు సత్యనారాయణ గౌడ్, పంచాయతీ వార్డు సభ్యులు పంచాయతి కార్యదర్శి మల్లేశం గౌడ్ కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షుడిగా మురళి నాయక్

**షాద్‌నగర్, ఆగస్టు 23, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్ల ఫోరం వ్యవస్థాపకురాలు నాగబెల్లి జ్యోతి ఆదేశాల మేరకు, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి గ్యార సురేష్ ఆధ్వర్యంలో ఫరూక్‌నగర్ మండల వార్డు మెంబర్ల ఫోరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఫరూక్ నగర్ మండల పరిధిలోని 47 గ్రామ పంచాయతీలకు చెందిన వార్డు సభ్యులు సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండల వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షుడిగా సువర్ణ మురళి నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుండ్రటి నవీన్ ఎంపికయ్యారు.కమిటీ గౌరవ అధ్యక్షుడిగా వెంకటయ్య, ఉపాధ్యక్షులుగా నారాయణరెడ్డి, స్వామి, శ్రీకాంత్, రవీందర్ నాయక్, ప్రధాన కార్యదర్శులుగా పవన్ కుమార్, కే. రాజు, కార్యదర్శులుగా కుమార్, శ్రీనివాస్, బాలరాజ్, నరేశ్, అధికార ప్రతినిధిగా నరసింహ, ప్రచార కార్యదర్శిగా నరేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి గ్యార సురేష్ మాట్లాడుతూ వార్డు సభ్యుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వారికి రావాల్సిన హక్కులు, గౌరవ వేతనం, విధులు, బాధ్యతల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. వార్డు సభ్యులు రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ఉండి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.నూతన అధ్యక్షుడు సువర్ణ మురళి నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ప్రతి వార్డు సభ్యుడికి కృతజ్ఞతలు తెలిపారు. వార్డు సభ్యుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు తన వంతు కృషి చేస్తానన్నారు."వార్డు సభ్యుల ఐక్యతే మా బలం – హక్కుల సాధనే మా లక్ష ్యం" అని సువర్ణ మురళి నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షులు, ఫరూక్‌నగర్ మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఘట్‌కేసర్‌లో బహదూర్ వెంకట్రామిరెడి విగ్రహం

**ఘట్‌కేసర్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో హైదరాబాద్ తొలి హిందూ కోత్వాల్ రాజబహదూర్ వెంకట రామారెడ్డి 157వ జయంతి నిర్వహించారు. ఘట్‌కేసర్ రెడ్డి సంఘం భవనంలో సంఘం అధ్యక్షులు చందుపట్ల వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డితో పాటు సంఘం సభ్యులు పాల్గొని వెంకట రామారెడ్డి చిత్రపటానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. హైదరాబాద్ నగరానికి రాజబహూదూర్ అందించిన పోలీసు పరిపాలనా, ప్రజా భద్రతా సేవలను కొనియాడారు. స్వర్గీయ వెంకట్రాంరెడ్డి అప్పటి బ్రిటిష్ ప్రభుత్వంలో మొదటి హిందూ కోత్వాల్‌గా సేవలందించిన సందర్భంగా అప్పటి ప్రభుత్వం రాజా బహదూర్ అనే బిరుదు ప్రకటించిందని గుర్తు చేసుకున్నారు. పోలీస్ సంస్కరణలు, సామాజిక సేవలు, విద్య సేవలు, పేద విద్యార్థులకు హాస్టళ్ళు, ఆయన చేసిన సామాజిక తదితర అంశాలపై ప్రసంగించి వారిని స్మరించుకున్నారు. త్వరలో ఘట్‌కేసర్‌లో రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని దీనికి ప్రతి ఒక్కరు కృషి చేస్తామని వారి సహాయ సహకారాలు అందిస్తామని స్వచ్ఛందంగా తెలిపారు. ఇటీవల మృతిచెందిన భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నరసింహారెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ రూపారెడ్డిలకు సంతాపంగా ఒరెండు నిముషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈకార్యక్రమంలో సంఘ ముఖ్య సలహాదారులు సింగిరెడ్డి రాంరెడ్డి, మారం లక్ష్మారెడ్డి, కొమ్మిడి రాఘవరెడ్డి, సంఘం మాజీ అధ్యక్షులు కొంతం రాంరెడ్డి, కట్ట జనార్దన్‌రెడ్డి, సంఘం కోశాధికారి పాటి మహిపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు పలుగుల శ్రీకాంత్‌రెడ్డి, సుడి శ్రీకాంత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి కంభం లక్ష్మారెడ్డి, కార్యవర్గ సభ్యులు గడీల రామచంద్రారెడ్డి, చందుపట్ల లక్ష్మారెడ్డి, బిరెడ్డి రవీందర్‌రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు ఏనుగు సుదర్శన్ రెడ్డి, పలుగుల మాధవరెడ్డి, కొమ్మిడి అనురాధ, కొంతం అంజిరెడ్డి, చందుపట్ల ధర్మారెడ్డి, రేసు లక్ష్మారెడ్డి, బొక్క ప్రభాకర్ రెడ్డి, కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, బద్దం జగన్ మోహన్ రెడ్డి, చిలుకూరి గోపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గడీల సంజీవరెడ్డి, చందుపట్ల మహేందర్ ఒడ్డి, సందుపట్ల జీవన్ రెడ్డి, కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, కందుకట్ల మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

## భాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలి

**మోమిన్‌పేట్, ఆగస్టు 23. ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ ఆదేశాల మేరకు, విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, బాల నేరాలు మరియు బాధ్యతాయుతమైన ప్రవర్తనపై అవగాహన కల్పించేందుకు మోమిన్‌పేట్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లో నషాముక్త్ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోమిన్‌పేట్ ఎస్ఐ జి. భరత్ భూషణ్ మాట్లాడుతు విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక దుష్ప్రభావాలను వివరించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, చెడు స్నేహాలకు లోనుకాకూడదని, మాదకద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాలు తమ దృష్టికి వస్తే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఇటీవల జరిగిన ప్రిన్సిపాల్ రూపారెడ్డి కేసు దర్యాప్తులో బాల నేరస్థులు ఉన్న కారణంగా, బాల నేరాలపై కూడా విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. నేరాలు, హింస, దొంగతనాలు, మాదకద్రవ్యాల వినియోగం మరియు ఇతర చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కలిగే పరిణామాలను వివరించారు. మంచి స్నేహితులను ఎంచుకోవాలని, క్రమశిక్షణ పాటించాలని, ఏవైనా సమస్యలు లేదా చెడు ప్రభావాలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు, మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ప్రోత్సాహం

**పెద్దేముల్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** ఓటమి గెలుపుకు నాంది అని, క్రీడల్లో గెలుపోటములు సహజమేనని తాండూరు గౌతమి మాడల్ స్కూల్ కరస్పాండెంట్ పి.మహిపాల్‌రెడ్డి అన్నారు. తాండూరు హిందు ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులచే శ్రీ సాయిపుత్ర హోమ్స్ అధినేత బావనోల్ల శంకర్ యాదవ్ టైటిల్ స్పాన్సర్స్‌గా అక్షర కాన్సెప్ట్ స్కూల్ గ్రౌండ్‌లో నియోజకవర్గ స్థాయి కబడ్డి పోటిలు నిర్వహించారు, ఈ కబడి పోటిల్లో చాంపియన్స్ షిప్ విజేతగా పెద్దేముల్ లయన్స్, రన్నరప్‌గా కోటపల్లి కింగ్స్ నిలిచారు. విజేతలకు శంకర్ యాదవ్ బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పిమహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభా కలిగిన క్రీడాకారులకు తమ ప్రోత్సాహం ఎల్లప్పుడు ఉంటుందని అన్నారు. విజేతగా నిలిచిన పెద్దేముల్ లయన్స్ టీమ్ క్రీడాకారులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో ధార్మిక పరిషత్ సభ్యులు విజయ్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, ఓం ప్రకాష్ సోమాని, కబడ్డి టీమ్ స్పాన్సర్స్ అజయ్ ప్రసాద్ ( బషీరాబాద్ ), మనోహర్ ( తాండూరు మండలం ) డాక్టర్ శరత్ చంద్ర (యాలాల్) రాములు ( కోటపల్లి) కిషన్ రాఠి మార్వాడి యువమంచ్ (తాండూరు టౌన్ ) నాయకులు రాజ్‌కుమార్ బీసీ సంఘం, పీటీలు రాధక్రిష్ణ, గోపాల్, అంపైర్స్ రాము, రవి ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



విజేతకు బహుమతిని అందజేస్తున్న పి.మహిపాల్‌రెడ్డి



## మృతుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

**మాడ్గుల, ఆగస్టు 23, ప్రభాతవార్త:** ఆర్కపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో తోలు అంజయ్య గారు మృతి చెందిన విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కళ్ల భాగ్యలక్ష్మి తిరుపతిరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంజయ్య మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ,ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ కళ్ల భాగ్యలక్ష్మి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోవడం బాధాకరమని, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. బాధిత కుటుంబానికి గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. తన వంతు సహాయంగా రూ.5,000 ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. గ్రామంలో ఎవరైనా ఆపదలో ఉన్నప్పుడు వారికి మానవతా దృక్పథంతో సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సర్పంచ్ పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుం టామని తెలిపారు. అనంతరం గ్రామ ప్రజాప్రతినిధులు, నాయ కులు, గ్రామ పెద్దలు బాధిత కుటుంబ సభ్యులను పరామ ర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ సిర్సవాడ సతీష్, నీలయ్య, చరణ్, తోలు ప్రసాద్,గ్రామ ప్రజాప్రతినిధులు, ఆర్కపల్లి గ్రామ ప్రజలు, యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం వాహనం

## 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

**ఘట్‌కేసర్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఘట్‌కేసర్ పోలీసులు, పౌరసరఫరాల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారంతో ఓఆర్ఆర్ ఘట్‌కేసర్ ఎంట్రీ వద్ద వాహనం నెంబర్ (టిఎస్08యుజి-4980)లను తనిఖీ చేయగా 78 బస్తాల్లో 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం గుర్తించారు. ఎలాంటి అనుమతులు, చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా బియ్యాన్ని షామీర్‌పేట్ వైపు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. తుర్కపల్లికి చెందిన వాహన డ్రైవర్ భూక్య సంతోష్ (26) గత మూడు రోజులుగా రేషన్ లబ్ధిదారుల నుంచి పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, అధిక ధరకు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు అంగీకరించాడు. బియ్యం పీడీఎస్‌కు చెందినదని పరీక్షల్లో నిర్ధారణ అయింది. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా సేకరించి తరలించి బ్లాక్ మార్కెట్‌లో విక్రయించేందుకు ప్రయత్నించినందుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని కీసరలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద భద్రపరిచారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు, రవాణా చేయడం బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## క్యాంపస్ డ్రైవ్‌లో 42 మందికి ఉద్యోగాలు

**ఘట్‌కేసర్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ కొండాపూర్‌లోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో మూడు ప్రముఖ కంపెనీలు నియామక ప్రక్రియలో పాల్గొన్నాయి. ఫార్మసీ కళాశాలలో పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించగా 18 ఫార్మసీ కళాశాలలకు చెందిన 136 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, రెట్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్, ఇనోవైన్ సైంటిఫిక్ మీటింగ్స్, వివిధ దశల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. అనంతరం మొత్తం 42 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికై, ఆఫర్ లెటర్లు పొందారు. ఎంపికైన విద్యార్థులను సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ ఎవి.రమణారెడ్డి, ప్రిన్సిపాల్ ఆర్. నరసింహారావు, ఇన్‌చార్జ్ శివకేశవరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ స్వాతి, టిపి, వివిధ విభాగాధిపతులు, కళాశాల అధ్యాపకులు అభినందించారు. విద్యార్థులకు మంచి కెరీర్ అవకాశాలు కల్పించినందుకు కంపెనీల ప్రతినిధులకు కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది. విద్యార్థులకు 100 ప్లేస్‌మెంట్ సపోర్ట్ అందించేందుకు కళాశాల కట్టుబడి ఉందని తెలిపారు.

## అర్జున్‌కు గురు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న అర్జున్

**ఘట్‌కేసర్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్ మాజీ ఉపసర్పంచ్ బోనకూర్తి అర్జున్‌కు గురుపురస్కారం అవార్డు లభించింది. హైదరాబాద్‌లో చిక్కడిపల్లిలోని త్యాగరాయగానసభలో శనివారం మహాశాస్త సేవా సంఘం రాజు గురుస్వామి, ప్రదీప్ నంబూద్రి ఆధ్వర్యంలో ఆయనకు గురుపురస్కారం అందజేశారు. అయ్యప్పస్వామి వంశోద్ధారకులు, పందల రాజ్య వంశీయులు, తాంత్రీక గురుస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అర్జున్ అయ్యప్పస్వామి దీక్షన తన సర్వస్వంగా భావించి గత 30 సంవత్సరాలుగా స్వామి సేవలో నిరంతరం నిమగ్నమై దీక్షను భక్తి, శ్రద్దలతో ఆచరిస్తూ, భక్తుల ధర్మసందేహాలను నివృత్తి చేస్తూ యువతను ధార్మిక మార్గంలో నడిపిస్తున్న అర్జున్ విశిష్ట సేవలను గుర్తిస్తూ గురుపురస్కారం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఘణాపూర్ సమీపంలోని అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకొని కృషి చేస్తున్నారని మహాశాత సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రాజు గురుస్వామి పేర్కొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

**తలకొండపల్లి ఆగస్టు 23,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేద ప్రజలకు వరం లాంటిదని లింగ రావు పల్లి గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామానికి చెందిన బొచ్చుపల్లి పెద్ద జంగయ్య కు మంజూరైన 60 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఎంతోమంది నిరుపేదలకు కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోలేని వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు వరంల ఆదుకుంటున్నాయని ఆయన అన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శిల్ప పొన్నడ, చిత్రంలో బాబుమోహన్

## పేదలకు తక్కువ ఖర్చుతో వైద్యం అందాలి

### సినీ నటుడు, మాజీ మంత్రి బాబుమోహన్

**హైదరాబాద్,ఆగస్టు 23, ప్రభాతవార్త :** అంతర్జాతీయ ప్రమాణాలతో పేదలకు వైద్యం అందుబాటులోకి రావాలని సినీ నటుడు, మాజీ మంత్రి బాబుమోహన్ అన్నారు. ఆదివారం కొండాపూర్‌లో ఏర్పాటు చేసిన చిరంజీవి వెరికోస్ వాస్కులర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిను ప్లానింగ్ అండ్ లాజిస్టిక్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్ డాక్టర్ భోపాల్ గజరావుతో కలసి బాబు మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలను బాబుమోహన్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వెరికోస్‌వెయిన్స్, కాళ్లలో రక్తనాళాల సంబంధిత సమస్యలు, ఇతర వాస్కులర్ వ్యాధులకు ఆధునిక వైద్య విధానాలతో నాణ్యమైన చికిత్స అందించాలనే లక్ష్యంతో ఆధునిక వైద్య సదుపాయాలతో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడం అభినందనీయమన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో ఇటువంటి వైద్యసంస్థలు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఆసుపత్రి నిర్వాహకులు, ప్రముఖ వెరికోస్ వెయిన్స్ నిపుణులు డాక్టర్ కె.సంజీవరావు, డాక్టర్ శిల్ప పొన్నాడ, ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ కె. వంశీ కృష్ణ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆస్పత్రిని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, రంగస్థల దర్శకులు ఈ.సముద్ర, వీరభద్రచౌదరి, తెలంగాణ ఆర్టిస్టు అసోసియేషన్ అధ్యక్షులు అన్నంగి రాజ శేఖర్, నిర్మాత మిత్తాన ఈశ్వర్, హీరోయిన్ సైనిక పాల్గొన్నారు.

### భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి

## మీడియా కో ఆర్డినేటర్‌గా ఆనంద్ గుప్తా

**చాంద్రాయణగుట్ట, ఆగస్టు 23, ప్రభాతవార్త:** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సెంట్రల్ కమిటి మీడియా కో-ఆర్డినేటర్‌గా దోరేటి ఆనంద్ గుప్తా నియమితులైయ్యారు. భారతీయ జనతా పార్టీలో క్రమశిక్షణ, అంకితభావం, సేవానిరతి గల సీనియర్ నాయకుడిగా, దూద్‌బౌలి ఉందాబజార్ శ్రీపైనీరు ముత్యాలమ్మ దేవాలయ చైర్మన్‌గా, దూద్‌బౌలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆనంద్‌గుప్తా స్వర్గీయ టైగర్ ఆలె నరేంద్రకు ప్రియమైన శిష్యుడు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితిలో కేంద్ర కమిటి మీడియా సమన్వయకర్తగా నియమితుడు కావటంతో బిజెపి నేతలు, ఆలయాల ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు, మీడియా ప్రతినిధులు ఆనంద్‌గుప్తాకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ గుప్తా మాట్లాడుతూ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి తనకు అప్పగించిన బాధ్యతలను మండప నిర్వాహకులు, పెద్దలు సహకారంతో సంపూర్ణంగా నిర్వహించగలనన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

## పాతబస్తీలో అట్టహాసంగా 'గణేష్ ఆగమన్'

**చాంద్రాయణగుట్ట, ఆగస్టు 23, ప్రభాతవార్త :** పాతబస్తీలో 'గణేష్ ఆగమన్'ల సందడి నెలకొంది. పలు ప్రాంతాలలో యూత్ అసోసియేషన్లు ఆగమన్ కార్యక్రమాలను ఎంతో అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. భారీ డిజిటల్ తెరలు, డిజె పాటలు, ప్యాడ్ బ్యాండ్ మోతల మధ్య యువత నడి వీధుల్లో హంగామా చేస్తున్నారు. ఒకరిని మించి మరొకరు పోటీ పడుతూ ఆగమన్లతో ఆబాల గోపాలని ఆకట్టుకుంటున్నారు. తాజాగా శనివారం రాత్రి లాల్‌దర్వాజా, గౌలిపురా గాంధీ నికేతన్ ప్రాంతాలలో పెద్ద ఎత్తున ఆగమన్ కార్యక్రమాలను నిర్వహించారు. లాల్‌దర్వాజా మహంకాళీ దేవాలయం వద్ద లాల్‌దర్వాజా కా రాజా ఆగమన్‌కు పెద్ద ఎత్తున యువత, బాలబాలికలు హాజరై ఎతైన గణేష్ మహారాజ్‌కు ఘన స్వాగతం పలికారు. భారీ డిజిటల్ తెరలపై బాల గంగాధర్ తిలక్, గణేష్ చిత్రాలు మిరుమిట్లు గొల్పుతుండగా రంగులు మారే విద్యుత్ దీపకాంతులు, డిజె పాటలు, ప్యాడ్ బ్యాండ్ మోతలకు యువత తన్మయత్వంలో నృత్యం చేశారు. ఈ దృశ్యాలను పలువురు తమ సెల్‌ఫోన్లలో బంధించారు. దీంతో సెప్టెంబర్ 14న ప్రారంభమైయే వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు పాతనగర వ్యాప్తంగా ముందస్తు సందడి మొదలైయ్యింది.

## బిజెపి ఒబిసి మోర్చా సమావేశం



సమావేశంలో పాల్గొన్న బిజెపి నాయకులు

**నిజాంపేట్, ఆగస్టు 23, ప్రభాతవార్త :** బిజెపి ప్రగతి నగర్ డివిజన్ కార్యాలయంలో ఓబీసీ మోర్చా అధ్యక్షుడు తూమాటి శంకర్రావు అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల రవికుమార్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం, పార్టీని పటిష్టం చేయడం, స్థానిక సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై నాయకులు చర్చించారు. అలాగే బీసీలకు ప్రభుత్వం చేస్తున్న అన్యాయం, బీసీలకు దక్కాల్సిన వాటా, కేంద్ర ప్రభుత్వం బీసీల కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై సమాలోచన చేశారు. ఓబీసీ మోర్చాను క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేస్తూ, బీసీల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో ఓబీసీ నాయకులు నరసింహాచారి, రవికిషోర్, శంకర్‌పట్నాయక్, పీవీ రాజు, ఈశ్వరాచారి, ప్రసాద్‌రావు, రఘు, మహిళా నాయకులు జ్యోత్స్న, హేమ, కోటేశ్వరరావు, సుమన్ పాల్గొన్నారు.

### వేములవాడ రాజరాజేశ్వర స్వామి మున్నూరు కాపు

## నిత్యాన్నదాన సత్రం డైరెక్టర్‌గా కుంట సిద్ధిరాములు పద్మ

**పేట్‌బషీరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త :** వేములవాడ రాజరాజేశ్వర స్వామి మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రం ట్రస్ట్‌లో కుంట సిద్ధిరాములు పద్మకి కీలక బాధ్యతలు అప్పగించారు. సత్రం వ్యవస్థాపక అధ్యక్షులు కొండ దేవయ్య పద్మని ట్రస్ట్ సత్రానికి డైరెక్టర్‌గా నియమిస్తూ ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం పద్మ మాట్లాడుతూ తనపై నమ్మకంతో డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు, ముఖ్యంగా మున్నూరు కాపు సమాజానికి సత్రం ద్వారా అందుతున్న సేవలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తానని పద్మ తెలిపారు. పద్మ నియామకంపట్ల మున్నూరు కాపు సమాజానికి చెందిన పలువురు సభ్యులు, సత్రం నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న పద్మ

# బంజారాల అభ్యున్నతికి సహకరిస్తా : ఎమ్మెల్యే



ఎమ్మెల్యే వివేకానంద్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

**పేట్‌బషీరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త**

బంజారా సమాజ ఆత్మగౌరవం, అభ్యున్నతికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. ఆదివారం కె.ఎం.పాండు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ సొంత నిధులతో సుమారు రూ.12 లక్షల వ్యయంతో 129వ సూరారం డివిజన్ శివాలయ నగర్‌లో నిర్మించిన బంజారాభవన్‌ను ఆయన ప్రారంభించారు. బంజారా సమాజ ఐక్యత, అభివృద్ధికి ప్రతీకగా ఈ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ ప్రజలకు చేసేసేవే శాశ్వతంగా మిగిలిపోతుందనే తన తండ్రి కె.ఎం.పాండు ఆశయ సాధనకు అనుగుణంగా బంజారాల ఆత్మగౌరవం, అభ్యున్నతికి ప్రతీకగా ఈ భవనాన్ని నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనను మూడుసార్లు గెలిపించడంలో, మూడోసారి రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించడంలో బంజారా సమాజం కీలక పాత్ర పోషించిందని అన్నారు. బంజారా సమాజం తనపై ఉంచిన నమ్మకానికి ఎప్పటికీ రుణపడి ఉంటానని, రానున్న రోజుల్లో వారి అభివృద్ధి, సంక్షేమానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని స్పష్టం చేశారు. అంతకుముందు బంజారా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు చేస్తూ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వారి సాంప్రదాయ నృత్యాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు వారాల వినోద్, కొండకల్ల శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ హుస్సేన్, కోలా శ్రీకాంత్, ఫెరోజ్, మహేశ్వర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు హేమలతారెడ్డి, బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ న్యూ శివాలయ నగర్ కమిటీ అధ్యక్షుడు గోపాల్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి శంకర్‌పవర్, ముఖ్యసలహాదారులు దుర్గాదాస్ మహారాజ్, శత్రునాయక్, కోశాధికారి రాజ్‌ప్రసాద్ నాయక్, సభ్యులు బీరం నాయక్, లక్ష్మణ్ పవర్, బాల్ సింగ్ పవార్, దర్శన్ పవార్, రాజు పవార్, రాజునాయక్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.





మాట్లాడుతున్న అంజయ్యగౌడ్. చిత్రంలో రాజశేఖర్, ఎస్ఎన్ చారి

### వికలాంగుల సంక్షేమ శాఖలో

## అవినీతిపై సిబిఐచే విచారణ జరిపించాలి

**సైఫాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త :** వికలాంగుల సంక్షేమ శాఖలో జరిగిన అవినీతి, అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సిబిఐచే విచారణ జరిపించాలని, అలాగే వికలాంగుల సమస్యలను పరిష్కారించాలని వికలాంగుల సంక్షేమ సంఘం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.అంజయ్యగౌడ్, దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు పి.రాజశేఖర్ కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగుల ఉద్యమం చేపడతారని వారు హెచ్చరించారు. ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ దివ్యాంగుల కోసం గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సౌండ్ లైబ్రరీ, బ్రెయిల్ ప్రెస్, శిక్షణా-ఉత్పత్తి కేంద్రాలు కృత్రిమ అవయువలా తయారీ కేంద్రాలను పునరుద్ధరించాలని కోరారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, బ్రెయిల్ ప్రెస్‌ను అధునీకరించాలని, వినికిడి పరికాల కేంద్రాన్ని తిరిగి ప్రారంభించాలని, టిసిపిసికి అనుబంధంగా ఉన్న ఐటవైను ఏసిటిగా అభివృద్ధి చేసి అధునిక నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని కొనసాగించాలని, దివ్యాంగుల వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించి విద్యా, కంప్యూటర్ వృత్తి శిక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.ఎన్.చారి, ప్రధాన కార్యదర్శి ఎస్.రాములు, వివిధ సంఘాల నాయకులురాఘవన్, వంశీరాజ్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపానికి కర్ర పూజ

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 23, ప్రభాతవార్త :** గాయిత్రినగర్ డివిజన్, గాయిత్రినగర్ కాలనీ గాంధీ బొమ్మ వద్ద గాయిత్రినగర్ గణేష్ ఉత్సవ కమిటీ, సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో వినాయక మండప నిర్మాణానికి కర్ర పూజ చేశారు. ఈ సంవత్సరం వినాయక విగ్రహాన్ని ఇప్పించడానికి సంక్షేమ సంఘం చైర్మన్ ఏ.లక్ష్మణ్ గుప్తా ముందుకు వచ్చారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఉత్సవాలను కులమతాలకు అతీతంగా వైభవోపేతంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు వేముల కృష్ణారావు, వైస్ చైర్మన్ కాశినాథచారి, మాజీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పి.శ్రీనివాస రావు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు నంద్ కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, జితేందర్, యూసుఫ్, సుదర్శన్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

## జంగమ్మెట్‌లో ఫాగింగ్

**చాంద్రాయణగుట్ట, ఆగస్టు 23, ప్రభాతవార్త :** జీహెచ్ఎంసి జంగమ్మెట్ సర్కిల్లో దోమల స్వైర విహారానికి అడ్డుకట్ట వేసేందుకు ఎంటమాలజీ విభాగం చర్యలు చేపట్టింది. దోమల నియంత్రణకు అవసరమైన ఫాగింగ్‌ను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. నాలాలు, అపరిశుభ్ర ప్రాంతాలలో దోమలు వృద్ధి చెందకుండ చర్యలు చేపడుతున్నారు. ఆ సర్కిల్ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ హెల్త్ (ఎఎంఒహెచ్) డాక్టర్ సంపత్ పర్యవేక్షణలో డబ్ల్యూఇఎస్ (వార్డ్ ఎంటమాలజీ సూపర్‌వైజర్) పి.శ్రీనివాస్ యాదవ్, ఎంటమాలజీ ఫీల్డ్ వర్కర్లు షేక్ నయీమ్, కార్తీక్‌లు మొబైల్ ఫాగింగ్ యంత్రంతో దోమల నివారణ పొగను వదులుతున్నారు. ఛత్రినాక, శివగంగానగర్, హమామ్‌బౌలి పరిసర బస్తీలలో చీకటి పడితే చాలు దోమలు బస్తీలపైకి దండయాత్ర చేస్తున్నాయి. దోమ కాటుతో జనం అనారోగ్యం పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులతో స్పందించిన అధికారులు ఆయా బస్తీలలో సాయంత్రం వేళ మొబైల్ ఫాగింగ్ యంత్రాలతో దోమల నివారణా పొగను వదులుతున్నారు. దీంతో కొంత వరకు దోమల సంచారానికి అడ్డుకట్ట పడి స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఒబేసిటి మహిళలను వేధిస్తున్న సమస్య

**జూబ్లీహిల్స్, ఆగస్టు 23, ప్రభాతవార్త :** ఒబేసిటీ నేటి ప్రపంచంలో మహిళలను వేధిస్తున్న అతి పెద్ద సమస్య అని సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ బాలాంబ పురాణం అన్నారు. బంజారాహిల్స్‌లోని ఒక హోటల్‌లో డయాబెటిస్, ఎడ్యుకేషన్ అంశాలకు చెందిన ఈవా స్త్రైడ్ 8వ వార్షిక సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. కిశోర బాలికలు, గర్భిణీలు, మహిళలు, వృద్ధాప్య దశ వరకు మహిళలు ఒబేసిటి వల్ల ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. రానున్న కాలంలో ఒబేసిటి వల్ల మరిన్ని సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ దశల్లోని మహిళలు మెటబాలిక్ హెల్త్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమ నిర్వాహకురాలు డాక్టర్ లిల్లి రోడ్రిగెస్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 500 మందికిపైగా వైద్యులు పాల్గొన్నారని తెలిపారు. పీడియాట్రిక్, గైనకాలజీ, జనరల్ ఫిజీషియన్, ఆర్థో, న్యూరో, కార్డియాలజిస్ట్ రంగాలకు చెందిన వైద్యులు ఈ సదస్సులో పాల్గొని మహిళల్లో వస్తున్న వివిధ సమస్యలు, పరిష్కారాలపై చర్చిస్తారని తెలిపారు. మహిళల్లో మెటబాలిక్ హెల్త్ దెబ్బతింటే వచ్చి పరిణామాలతో పాటు మెటబాలిక్ హెల్త్‌ను ఆరోగ్యవంతంగా ఎలా మలుచుకోవాలి అనే అంశాలపై చర్చిస్తామని వెల్లడించారు. మహిళల్లో ఆరోగ్య అవగాహన తో పాటు ఎడ్యుకేషన్‌ను పెంచేందుకు ఈవా స్త్రైడ్ పని చేస్తుందని వెల్లడించారు. సమస్యల్లో పడకుండా ఉండేందుకు ముందుగానే ప్రివెంటివ్ ప్రోగ్రెస్ విధానాలపై చర్చిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ప్రెసిడెంట్ ఎన్. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌జీటీఏ నూతన కార్యవర్గం ఏర్పాటు

### అధ్యక్షుడిగా వినీల్ పర్వతనేని ఎన్నిక

**జూబ్లీహిల్స్, ఆగస్టు 23, ప్రభాతవార్త :** హైదరాబాద్ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (హెచ్‌జీటీఏ) 2026-28 కాలానికి నూతన మేనేజ్‌మెంట్ కమిటీని ఎన్నుకుంది. బంజారాహిల్స్‌లోని రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌లో జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. హెచ్‌జీటీఏ అధ్యక్షుడు అజయ్ శర్మ ఆధ్వర్యంలో, ఓంకార్ ట్రాన్స్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ రాంకుమార్ రాటి ఎన్నికల అధికారిగా అధికారిగా ఈ ఎన్నికలను నిర్వహించారు. గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్, లాజిస్టిక్స్ రంగానికి ప్రతినిధ్యం వహిస్తున్న హెచ్‌జీటీఏ 1971లో ఏర్పాటైన సంస్థగా, రవాణా రంగ సమస్యలపై ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ పనిచేస్తోంది. 2026-28 కాలానికి వినీల్ పర్వతనేని అధ్యక్షుడిగా, వివేక్ గుప్తా (ఎక్స్‌ప్రెస్ రోడ్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్) ఉపాధ్యక్షుడిగా, అశోక్ గోయల్ (జై శ్రీ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ) జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఎం. అజీముద్దీన్ (భారత్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్) జాయింట్ సెక్రటరీగా, కె. రాఘవేందర్ (మంగల్ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్) కోశాధికారిగా బాధ్యతలు చేపట్టనున్నారు. మేనేజింగ్ కమిటీ సభ్యులుగా రాజేష్ సింగ్, అభిషేక్ రాటి, అజిత్ భండారి, ప్రవీణ్ శర్మ, అజయ్ పిలానియా, విశేష్ అగర్వాల్, గౌరవ్ వత్స, రాహుల్ గార్గ్, సత్యుగ్ కేజ్రీవాల్, అన్షుల్ గోయల్ తదితరులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో రవాణా రంగ సమస్యలను పరిష్కరించేందుకు, సభ్యుల సంక్షేమంతో పాటు రవాణా రంగ అభివృద్ధికి ప్రభుత్వంతో సమన్వయంతో పనిచేస్తామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా స్టేట్ లైన్ నర్సింహులు గుప్తా, కందుకూరి శ్రీనివాసులు, కేఆర్ గణేష్ లకు జీవన సాఫల్య పురస్కారాలను అందించారు.

### వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ జాతీయ అధ్యక్షుడిగా కిఫాయత్

**చార్మినార్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** మానవ హక్కుల పరిరక్షణ సామాజిక సేవ ప్రజా సంక్షేమం కోసం అన్ని విధాల కృషి చేస్తానని వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన పాతబస్తీకి చెందిన ఎం.డి. కిఫాయత్ అన్నారు. న్యూఢిల్లీలోని ప్రధాన మంత్రి కార్యాలయంలో శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఆయన మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి ఆదివారం నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

## బిజెపి సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడిగా అరవింద్

**సికింద్రాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** బీజేపీ సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడిగా అరవింద్ చందుపట్ల నియమితులయ్యారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి డివిజన్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డా.కె. లక్ష్మణ్, మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్‌లో కేంద్రప్రభుత్వ అభివృద్ధి, పథకాలు ప్రజలకు అందేలా చూడడంతో పాటు ప్రతి కార్యకర్తను, పార్టీ పట్ల అభిమానంతో ఉన్న వారిని కలుపుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా యువతను పార్టీకిలో చేర్చడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

# త్యాగధనుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులు

### రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, అభివృద్ధిశాఖ వి.హనుమంతరావు



జయజయహో ఆంధ్రకేసరి గీతాన్ని ఆవిష్కరిస్తున్న హనుమంతరావు, వేణుగోపాలాచారి తదితరులు

**నాంపల్లి, ఆగస్టు 23 ప్రభాతవార్త :** స్వాతంత్ర్య సమరయోధుడు, త్యాగధనుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని, దేశానికి ఆయన చేసిన ఎన్నటికీ మరువలేనిదని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ప్రభుత్వ సలహాదారు-తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, అభివృద్ధిశాఖ వి.హెచ్.హనుమంతరావు అన్నారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 155వ జయంతిని పురస్కరించుకుని ప్రకాశం అభివృద్ధి, అధ్యయనం సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని రవీంద్రభారతి కూడలిలోని ప్రకాశం పంతులు విగ్రహానికి హనుమంతరావుతోపాటు ఎల్.వి.సుబ్రహ్మణ్యం, రుద్రరాజు పద్మరాజు, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, ప్రకాశం సంస్థ ముఖ్యసలహాదారు. మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, నేరెళ్ల మల్యాద్రి, టంగుటూరి శ్రీరామ్, బి.శ్రీనివాస్, బుచ్చి రాంప్రసాద్, రామ్‌దాస్, సరోజ, వి.ఎన్,ఆదిత్య, సంస్థ సభ్యులు డా. పి.మోహనరావు, నిరంజన్ దేశాయ్, రాజశేఖర్,రామ్‌మోహన్‌రెడ్డి, రాధాకృష్ణ తదితరులు పాల్గొని ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలువేసి ఘననివాళులర్పించి ప్రసంగించారు. తెలంగాణ బ్రాహ్మణ పరిషత్తు చైర్మన్ బి.శ్రీనివాస్ టంగుటూరి ప్రకాశంకు భారతరత్న బిరుదు ప్రదానం చేయాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, దూరదృష్టితో, తెగువతో ఆయన తీసుకొచ్చిన సంస్కరణలు నేటితరానికి స్ఫూర్తిదాయకమని రుద్రరాజు పద్మరాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ ప్రకాశం పంతులు విలువలు కలిగిన రాజకీయనేతని, దార్శనికుడని గ్రామస్వరాజ్యానికి కృషిచేశారని, ఆయనకు కేంద్రం భారతరత్న ఇవ్వాల్సిదేనని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ గేయరచయిత రామ్‌దాస్ టంగుటూరిపై రచించి స్వరపరచిన జయజయహో ఆంధ్రకేసరి గీతాన్ని అతిథుల చేతులమీదుగా ఆవిష్కరించారు.

## ఘనంగా బోనాల ఉత్సవాలు

**నిజాంపేట్, ఆగస్టు 23, ప్రభాతవార్త :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి డబుల్ బెడ్‌రూమ్ పరిధి, రాజీవ్ గాంధీ నగర్ ప్రాంతాల్లోని ఆదివారం ఎల్లమ్మ, నల్లపోచమ్మ తల్లి ఆలయాల్లో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి : రచ్చ చక్రధర్

**నిజాంపేట్, ఆగస్టు 23, ప్రభాతవార్త :** ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయడం ఒక అలవాటుగా చేసుకోవాలని రచ్చ చక్రధర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రగతినగర్ డివిజన్ శ్రీనివాస్‌నగర్ కాలనీ పార్క్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని బీజేపీ జిల్లా నాయకులు రచ్చ చక్రధర్ సందర్శించారు. ఈ సందర్భంగా రక్తదానం చేస్తున్న దాతలను అభినందించి, రక్తదానం ప్రాణదానంతో సమానమని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం అవసరమైన వారికి రక్తదాతలు అందించే సహాయం ఎంతో విలువైనదని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సత్యనారాయణ, రామకృష్ణ, ఉమామహేష్ పాల్గొన్నారు.

## జీవో నెం 97ను రద్దు చేయాలి



ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ సువర్ణలత

**అడ్డగుట్ట, ఆగస్టు 23 ప్రభాతవార్త:** పాలిటెక్నిక్ విద్యార్థులు, ఉద్యోగుల ప్రయోజనాలకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించాలని, పాలిటెక్నిక్ విద్యను శక్తి శాఖను వెనక్కి తీసుకోవాలని, జీవో నెం 97ను రద్దు చేయాలని, మారేడ్‌పల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సువర్ణలత ఆధ్వర్యంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల హెచ్‌ఓడీలు శివ కుమార్, డాక్టర్ నవీన్, నర్సింగ్ రావ్, లెక్చరర్లు శ్రీధర్, ఉజ్వల్, గోవింద్ రావ్, కిరణ్, నవీన్, జీ.నిషాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి : ఎమ్మెల్యే

**కంటోన్మెంట్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, అమ్మవారి ఆశీస్సులు, చల్లని చూపు ఎల్లవేళలా ఉండాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శ్రావన మాస బోనాల వేడుకలను పురస్కరించుకొని ఆదివారం అన్నానగర్ చౌరస్తాలోని పోచమ్మ, పెద్దమ్మ, బీరప్ప దేవాలయాల్లో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, 3వ వార్డు కాంగ్రెస్ నేత రాజేష్ యాదవ్ లతో పాటు కాంగ్రెస్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

**కంటోన్మెంట్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 4వ వార్డు పికెట్ చౌరస్తాలో ఉన్న పాత అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించి నూతన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటుకు హైదరాబాద్ జిల్లా సాంఘీక సంక్షేమ డెవలప్‌మెంట్ అధికారులు ప్రత్యేక నిధులు విడుదల చేశారు. అందుకు కంటోన్మెంట్ బోర్డు సిఈఓ నూతన అంబేద్కర్, జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలను ఏర్పాటు చేయుటకు కంటోన్మెంట్ బోర్డు సిఈఓ అరవింద్ కుమార్ ద్వివేది ఎన్ఓసీ చేశారు. దీంతో ఆదివారం ఆ విగ్రహాలను మరోచోటికి మార్చి నూతన విగ్రహాలను ఏర్పాటు, అభివృద్ధి పనులు చేపడుతున్న నేపథ్యంలో ఆదివారం ఆ మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ గోపాలక్రిష్ణ, మారేడ్‌పల్లి సిఐ వీరబాబు, ఎస్సీ డిపార్ట్‌మెంట్ అధికారి శ్వేతా రామ్‌దేవీ, దళిత సంఘాల నేతలు కె.హెచ్. గంగారామ్, టీఈ.రాకేష్, సాయికుమార్, సాధన్, దేవేందర్, ముప్పిడి మధుకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారు ప్రజలను చల్లగా కాపాడాలి : ఎమ్మెల్యే

**బేగంపేట ఆగస్టు 23, ప్రభాతవార్త :** అమ్మ వారు ప్రజలను చల్లగా కాపాడాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శ్రావణ మాసం బోనాల సందర్భంగా ఆదివారం రాంగోపాల్ పేట డివిజన్ పరిధిలోని నల్లగుట్ట, ఎఫ్‌లైన్, సీలైన్, కాచిబౌలి, వెంగళరావునగర్, ప్రాంతాల్లోని జూలమ్మ ఆలయం, కొండపోచమ్మ, కనకదుర్గమ్మ, గాలి మైసమ్మ, శ్రీరేణుక ఎల్లమ్మ, బాలత్రిపురసుందరీ, ముత్యాలమ్మ, బ్రమరాంబిక దేవాలయాలను ఎమ్మెల్యే తలసాని సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు ఎమ్మెల్యేతో పూజలు నిర్వహింపజేసి శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ మల్లిఖార్జున్ గౌడ్, ఆకుల హరికృష్ణ, నాయకులు కిషర్, డి.వి.నరేందర్‌రావు, ఆంజనేయులు, సతీష్, కొండాపురం మహేష్‌యాదవ్, అరుణ్‌భట్ ఉన్నారు.

## ఐకమత్యంతో ఉత్సవాలను జరుపుకుంటున్న ప్రజలు

**చార్మినార్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** ప్రజలు ఐకమత్యంతో ఉత్సవాలను జరుపుకుంటున్నారని చార్మినార్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ బిజెపి నాయకులు శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మవారికి శ్రీనివాస్ యాదవ్ కుటుంబ సభ్యులు ఆదివారం బోనం సమర్పించారు. శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ బిజెపి నాయకులు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ నగరంలోని ప్రజలుమత సామరస్యానికి ప్రతీకగా ఐకమత్యంతో పండుగలను నిర్వహించుకుంటున్నారని తెలిపారు. ఘాన్సీ బజార్‌లోని ఆనందగల్లీకి చెందిన పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో భక్తుల సందడి...**

చార్మినార్ శ్రీభాగ్యలక్ష్మీ మందిరంలో అమ్మవారికి ఆదివారం వేలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంటనగరాలకు చెందిన ప్రజలతో పాటు చార్మినార్‌ను చూడటానికి వచ్చిన పర్యాటకులు చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు జరిపారు. భక్తుల రద్దీగా కారణంగా చార్మినార్ పరిసర ప్రాంతాలలో విపరీతమైన రద్దీ ఏర్పడింది. మరో వైపు ఆదివారం సెలవు దినం కావటంతో పాతబస్తీలోని లాడ్‌బజార్ గాజుల షాపులు, చార్మినార్ చుట్టూ ఉన్న షాపులు కొనుగోలు దారులతో కిక్కిరిసి పోయాయి.

## సంస్కృతి, సంప్రదాయ సమ్మేళనమే బోనాలు : కోట నీలిమ

**బేగంపేట ఆగస్టు 23, ప్రభాతవార్త :** భక్తి, సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనమే బోనాలు అని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ డా.కోట నీలిమ అన్నారు. శ్రావణమాస బోనాల సందర్భంగా నియోజకవర్గం పరిధిలోని రాంగోపాల్‌పేట డివిజన్ లో కోట పలు ఆలయాలను దర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయ కమిటీల నిర్వహకులు కోటను ఘనంగా శాలువాలతో సత్కరించి పూజలు నిర్వహింపజేసారు. వెంగళరావునగర్‌లోని శ్రీరేణుక ఎల్లమ్మ, శ్రీఉప్పలమ్మ, నల్లగుట్టలోని బ్రమరాంబ ఆలయాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణా ప్రజల ఆత్మగౌరవానికి, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీల నిర్వహకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జేహెచ్‌పీఎస్‌లో ప్రతిభాదర్శన్ వేడుకలు

**జూబ్లీహిల్స్, ఆగస్టు 23, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్‌లోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్(జేహెచ్‌పీఎస్)లో మూడో తరగతి విద్యార్థులకు జీవితపు రత్నాలు పేరుతో నిర్వహించిన ప్రతిభాదర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మానవ జీవితంలో డబ్బుతో కొనలేనివి సృష్టిలో చాలా ఉన్నాయని తెలియజెప్పేలా ఇందులో రూపొందించిన ప్రదర్శనల ద్వారా విద్యార్థులు తెలియజెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు విధు మోహన్ మాట్లాడుతూ విలువలు అనేవి ప్రతి వ్యక్తి జీవితంలో అంతర్భాగమన్నారు. విద్యార్థులకు విలువ తెలియజేయడానికి అనేక రూపకాలను, ప్రదర్శనలను ఏర్పాటుచేసి వారిని భాగస్వాములను చేసినట్లు తెలిపారు. పాఠశాల డైరెక్టర్ యం. వరలక్ష్మి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందిస్తే విద్యార్థుల భవిష్యత్తు బంగారంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.